హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.95	140	170
నల్లగొండ	రూ.100	145	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 20.4



సాగర్, మూసీకి పూడిక ముప్పు

ఆధునిక దేవాలయం, బహుళార్థసాధక ప్రాజెక్టు అయిన నాగార్జునసాగర్ జలాశయం రోజు రోజుకూ నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐదు జిల్లాల పరిధిలోని ఆయకట్టు అన్నదాతల ఇంట సిరులు కురిపిస్తున్న సాగర్ జలాశయంలో నీటి నిల్వ తగ్గుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నాగార్జునసాగర్)

- ఈ ఏడాది సుమారు 112 టీఎంసీల మేరతగ్గిన నీటి నిల్వ
- ఏటా వందల టీఎంసీల నీరు కడలిపాలు
- రాళ్లు, రప్పలతో పేరుకుపోతున్న పూడిక
- ఆందోళనలో ఆయకట్టు రైతాంగం

కృష్ణా నది పరివాహకం 2,58,948 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉండగా, ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటితో పాటు ఒండ్రు మట్టి, ఇసుక ఏటా నాగార్జునసాగర్ జలాశయంలోకి వచ్చి చేరుతోంది. అదే విధంగా నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎత్తయిన గుట్టల పై నుంచి వచ్చే వరద నీటితో పాటు రాళ్లు, రప్పలు కృష్ణ నదిలోకి వచ్చి చేరుతున్నాయి. వరద అధికంగా వచ్చే సమయంలో నదీ తీరాలను ఒరుసుకుంటూ వచ్చే నీటి ఉధృతితో తీరాలు కోతకు గురై చెట్లు, చేమలు, మట్టి కొట్టుకొని వచ్చి ఏటా జలశయంలోకి చేరుతోంది. జలాశయంలో నిండుగా నీరున్నపుడు గుట్టలు నదిలోకి కూలుతున్నాయి. 110 చదరపు మైళ్ల పరిధిలో ఐదు జిల్లాల నడుమ విస్తరించి ఉన్న జలాశయంలో వేలాదిగా జీవాలు, జంతు జలాలు తాగునీటికి వచ్చినపుడు ఎత్తయిన ప్రాంతాల నుంచి జారిపడే రాళ్లు తక్కువేమీ కావు. ఒక్క రోజేగాక ఏడాది పొడవునా ఇదే జరుగుతోంది. జలాశయం నుంచి మాత్రం ఒక్క తట్ట మట్టి గానీ, ఏ ఒక్క రాయి కూడా బయటికి వెళ్లడం లేదు. దీంతో పూడిక పెరిగి నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోంది. పూడికకు నివారణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్ ఏడారిగా మారే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సాగర్ జలాశయంలో కొండలపై నుంచి కూలుతున్న రాళ్లు (ఫైల్)

చర్యలు శూన్యం

సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన జరగ్గా, 1967లో పూర్తయింది. నాటి నుంచి నేటి వరకు 70 ఏళ్లలో చేరిన పూడిక సుమారు 112 టీఎంసీల (శతకోటి ఘనపుటడుగులు) పైచిలుకు నీటి నిల్వలు ఉండే ప్రాంతాన్ని మింగేసింది. ఏ ప్రభుత్వం కూడా నేటి వరకు పూడికపై ఎలాంటి దృష్టిసారించలేదు. దీంతో ఆయకట్టు రైతాంగం ఆందోళనకు గురవుతోంది. కేంద్రం జల నిపుణుల బృందం ఐదు, పదేళ్లకోసారి పూడికపై సర్వే నిర్వహించి ఎంత పూడిందో చెప్పడమేగానీ ఎలాంటి చర్యలు చేపట్టాలో వివరించిన దాఖలాలు లేవు. సాగర్ జలాశయాన్ని గరిష్ఠ వరద ప్రవాహం 10.60లక్షల...

- మిగతా 7వ పేజీలో...



నీటిబొట్టు ఒడిసి పట్టు

జలం.. సకల జీవకోటికి ప్రాణాధారం.. జలం లేనిదే మనిషి మనుగడ లేదు. జీవాధారమైన ఈ జలాన్ని మనిషే వృథా చేస్తున్నాడు. జనాభా పెరుగుదలతోపాటు మనిషి స్వార్థ ప్రయోజనాల కోసం అవసరానికి మించి నీటిని వినియోగిస్తున్నాడు.అంతేగాక భవిష్యత్ అవసరాల కోసం మిగిల్చి ఉంచాల్సిన జలాన్ని వృథా చేస్తున్నాడు. దీనికితోడు జలచక్రం సాఫీగా సాగేందుకు ఉపయోగపడే అడవుల ను, చెట్లను ఇష్టారీతిన నరికివేస్తుండటంతో అనావృష్టి, అతివృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో జలాశయాలు, చెరువు లు, కుంటల్లో నీరు అడుగంటి భూగర్భనీటిమట్టం పాతాళానికి పడిపోతోంది. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా నల్లగొండలో ఈ పరిస్థితి దారుణంగా ఉంది. నల్లగొండ జిల్లాలో భూగర్భ నీటి మట్టం 7.74మీటర్ల లోతులో ఉండగా, సూర్యాపేట జిల్లాలో 3.60మీటర్లు, యాదాద్రి జిల్లాలో 2.36 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. నల్లగొండ డివిజన్‌లో 2022లో 4.85 మీటర్ల లోతులో భూగర్భనీటిమట్టం ఉండగా, ఈ ఏడాది 8.59మీటర్ల లోతుకు పడిపోయింది. దేవరకొండ డివిజన్‌లో 2022లో 6.14 మీటర్ల లోతులో ఉండగా, ఈ ఏడాది 8.44మీటర్లకు పడిపోయింది. మిర్యాలగూడ డివిజన్‌లో 2022లో 5.71మీటర్ల లోతులో ఉండగా, ప్రస్తుతం 6.23మీటర్ల లోతుకు భూగర్భజలమట్టం పడిపోయింది.

చెమ్మనూ పెంచాడు

అడవిని సృష్టించిన దుశ్చర్ల

• 6లో..

నిధుల కొరత, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం వెరసి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెం డో నాగార్జునసాగర్‌గా ఉన్న మూసీ జలాశయానికి పూడి క ముప్పు ముంచుకొస్తోంది. జిల్లాలో రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న ఈ ప్రాజెక్టు ఏటా పూడికతో నిండుతోంది. సుమారు 30వేల ఎకరాలకు సాగునీరందించే ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురవుతోంది.

- (ఆంధ్రజ్యోతి,కేతేపల్లి)

- నానాటికీ తగ్గుతున్న రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం
- పరిరక్షణ చర్యలు చేపట్టాలని సీడబ్ల్యూసీ హెచ్చరిక

నాగార్జునసాగర్ తర్వాత ఉమ్మడి జిల్లాలో ప్రధాన నీటి వనరుగా మూసీ ప్రాజెక్టు ఉంది. ప్రాజెక్టుకు ఉన్న స్కవర్‌గేట్లు పూర్తిగా మూసి వేయడంతో మూసీ నదికి వరదలు వచ్చినప్పుడు ఉప నదులు, వాగుల ప్రవాహంతో ఇసుక, మట్టి వరద నీటితో కలిసి ప్రాజెక్టులోకి వచ్చి పేరుకుపోతోంది. మూసీ ఎగువన ఉన్న పట్టణాలు, నగరాల నుంచి వినియోగించిన జలాలు, మురుగు సైతం ప్రాజెక్టులోకి చేరుతోంది. నది ఒడ్డు కోతకు గురికావడం కూడా పూడికకు ఓ కారణంగా ఉంది. దీంతో ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం ఏటా తగ్గుతుండగా, పూర్తిస్థాయి ఆయకట్టుకు నీటిని అందించడంలో విఫలమవుతోంది. 25.25చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉన్న ఈ రిజర్వాయర్‌లో చేరిన పూడిక సుమారు 10అడుగుల మేర ఉండనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రంగారెడ్డి జిల్లా వికారాబాద్ అడవుల్లో పుట్టిన మూసీ భువనగిరి జిల్లా మీదుగా నల్లగొండ జిల్లా నుంచి సూర్యాపేట జిల్లాకు చేరుతోంది.

సూర్యాపేట మండలం సోలిపే ట వద్ద రెండు గుట్టల మధ్య రూ.2.20కోట్ల వ్యయంతో 1954లో మూసీ ప్రాజెక్టు పనులు ప్రారంభించగా, 1963 లో పూర్తయింది. రిజర్వాయర్‌లో సూర్యాపేట మండలం సోలిపేటతో పాటు కేతేపల్లి మండలంలోని బొప్పారం గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. ప్రాజెక్టులో చేరే పూడికను బయటికి పంపేందుకు వీలుగా 10 స్కవర్‌గేట్లు, వరద నీటిని దిగువకు వదిలేందుకు 8 క్రస్ట్‌గేట్లు, 12 రెగ్యులేటరీ గేట్లతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. 645అడుగుల (4.46 టీఎంసీలు) నీటినిల్వ సామర్థ్యంతో ఈ ప్రాజెక్టుకు నాటి ఇంజనీరింగ్ నిపుణులు రూపకల్పన చేశారు. దశాబ్దాల తరబడి ప్రాజెక్టు ఆధునీకీకరణకు నోచుకోకపోవడంతో ప్రాజెక్టు నిర్మించిన నాడు ఏర్పాటు చేసిన గేట్లు తుప్పుపట్టాయి. ప్రాజెక్టు నిర్మించిన నాటి నుంచి గేట్ల నిర్వహణకు నిధుల కేటాయింపు అరకొరగానే సాగింది. దీంతో 1987లో మూసీకి వచ్చిన వరద తాకిడికి 8వ నెంబర్ స్కవర్‌గేటు కొట్టుకుపోయింది. ఆ తర్వాత..

- మిగతా 7వ పేజీలో...



మూసీ ప్రాజెక్టులో మేట వేసిన పూడిక దిబ్బలు (ఫైల్)

తాగునీటి ఏర్పాట్లకు రూ.5.10కోట్లు విడుదల

కలెక్టర్ ఇలా త్రిపాఠి



నాంపల్లి ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు, బోర్లు, చేతిపంపులు, పైపులైన్లు, తాగునీటి ట్యాంకుల మరమ్మతుకు డీఎంఎఫ్‌టీ నిధులు రూ.5.10కోట్లు విడుదల చేసినట్టు కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 827 పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. మంజూరైన నిధులతో గ్రామాల్లో చేతిపంపులు, బోర్లు, పైపులైన్లు, నీటి ట్యాంకుల మరమ్మతు చేయించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ పనులను సంబంధిత ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు. పనుల పూర్తిఅంచనాలు రూపొందించి ముందస్తు అనుమతి తీసుకొని ప్రారంభించాలన్రాను. అదేవిధంగా పనులు పూర్తయ్యాక ఫొటోలతో సహా బిల్లులు సమర్పించాలని, గతంలో చేపట్టిన పనులు తిరిగి చేపట్టకూడదని, వేరే పథకాలలో చేపట్టిన పనులు డీఎంఎఫ్‌టీ నిధుల కింద చేపట్టవద్దని స్పష్టం చేశారు. ఎక్కడా తాగునీటికి సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, నాంపల్లి): ప్రభుత్వ ఆస్పత్రిలో అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం నాంపల్లి పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రి సిబ్బంది హాజరు, ఓపీ రిజిస్టర్, ఈడీడీ, ఏఎన్‌సీతో పాటు అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఏ ఆస్పత్రిలో లేనివిధంగా ఇక్కడ ఏడుగురు ఇన్ పేషెంట్లు ఉండడం చూసి వారితో మాట్లాడారు. తాము నాగర్‌కర్నూల్, హైదరాబాద్ నుంచి వచ్చామని ఇద్దరు రోగులు కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ వచ్చే సమయానికే 73మంది ఓపీ పేషెంట్లు వైద్య సేవలు పొందడంపై పీహెచ్‌సీ వైద్యురాలు భవానీని అభినందించారు. హాస్టల్ విద్యార్థులు రక్తహీనతతో బాధపడకుండా అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రి పరిధిలో గత ఏడాది డిసెంబరు వరకు 6శిశుమరణాలు సంభవించగా, ఈ మూడు నెలల్లో ఎలాంటి కేసులు లేవని డాక్టర్ భవాని కలెక్టర్‌కు వివరించారు. పీహెచ్‌సీకి ఆటోక్లేవ్, ఫిటల్ డాప్లర్, సర్జికల్ పరికరాలను కలెక్టర్ మంజూరు చేశారు.అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేసి వంటగది, డైనింగ్, తరగతి గదులు,భోజనాన్ని పరిశీలించారు. ఐదు, పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి కష్టపడి చదివి లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ జి.దేవాసింగ్, ఎంపీడీవో పీవీఎస్‌కె.శర్మ, ఎంపీవో ఝాన్సీ, డాక్టర్ తరుణ్, సీహెచ్‌వో ఏకనాథం, సూపర్‌వైజర్ అంజలి, ఎంఎల్‌హెచ్‌పీలు దువ్వ నవీన్, కళ్యాణి, సంతోష,తస్లీమా, దీపిక, ప్రశాంతి, తదితరులు ఉన్నారు.

ఏటీసీకి స్థల పరిశీలన

(ఆంధ్రజ్యోతి, చండూరు): చండూరు మునిసిపాలిటీ పరిధిలోని అంగడిపేటలో ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) నిర్మాణం కోసం స్థలాన్ని కలెక్టర్ ఇలా తి్రపాఠి శుక్రవారం పరిశీలించారు. 361 సర్వే నెంబర్‌లో సుమారు రెండు ఎకరాల స్థలంలో ఏటీసీ నిర్మాణం అనువైనదిగా ఆమె గుర్తించారు. స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని ఆర్డీవో శ్రీదేవిని ఆదేశించారు. ఆమె వెంట తహీల్దార్ దశరథ, మునిసిపల్ అధికారులు, ఉన్నారు.

‘పది’ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు 40 విద్యార్థుల గైర్హాజరు
- పలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



జిల్లా కేంద్రంలో ఓ పరీక్షా కేంద్రాన్ని తనిఖీచేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండటౌన్,మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం జిల్లాలో ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 105 కేంద్రాల్లో 18,511మంది విద్యార్థులకు 18,471 మంది హాజరుకాగా, 40మంది గైర్హాజరయ్యారు.కాగా, కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా కేంద్రంలోని దేవరకొండరోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీచేశారు. ఈ సందర్భంగా డీఈవో, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి, విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

(ఆంధ్రజ్యోతి, గుర్రంపోడు): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీచేశారు. కొందరు విద్యార్థులు మాస్కులు ధరించి ఉండటాన్ని గమనించిన వారు తీసుకువచ్చిన మాస్కులు కాకుండా అవసరమైన వారికి అధికారులే మాస్కులు పంపిణీ చేయాలని సూచించారు. 142 మంది విద్యార్థులకు అంతా హాజరయ్యారని, ఎంఈవో మండల నోముల యాదగిరి, చీఫ్ సూపరింటెండెంట్ శేఖర్ వివరించారు. కలెక్టర్ వెంట డీఈవో బి.భిక్షపతి ఉన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:33 (శనివారం సాయంత్రం) — సహర్: 4:56 (ఆదివారం ఉదయం)

తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నల్లగొండ క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఉగాది, రంజాన్ పర్వదినాల సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టే వారిని నిరంతరం సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఎవరైనా ఇతర కులాలు, మతాలు, వ్యక్తులపై అనుచిత వ్యా ఖ్యలు చేసినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా అసత్య ప్రచారా లు చేసినా తగిన చర్యలు తప్పవన్నారు. ఎవరైనా ఇలాంటి పోస్టులు షేర్ చేస్తే, వారి సమచారాన్ని సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి

జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి



నూతనంగా బాధ్యతులు చేపట్టిన వారితో జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

నల్లగొండ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాల ద్వారా నూతనంగా విధుల్లో చేరిన ఉద్యోగులు బాధ్యతలను సక్రమంగా నిర్వహించి పేరు తెచ్చుకోవాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాల ద్వారా జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరిన వారికి శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వీస్ రూల్స్ కార్యాలయ బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో బి.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొప్పు రాంబాబు, ప్రధానకార్యదర్శి కె.నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి









వేసవి తాపం తీవ్రమవుతుండటంతో నల్లగొండలో మూగజీవాలు దాహార్తిని ఎదుర్కొంటున్నాయి. ఈ తరుణంలో నీటి చెమ్మ కనిపించిన ప్రతీ చోటా జీవాలు వాలిపోతున్నాయి. నల్లా లీకేజీలు, తాటిచెట్టుపై కల్లు, తొట్లలోని నీటిని తాగుతూ దాహం తీర్చుకుంటున్నాయి.

ఫొటోలు: (ఆంధ్రజ్యోతి-స్టాఫ్‌ఫొటోగ్రాఫర్,నల్లగొండ)

నీటి బొట్టు.. ఒడిసి పట్టు

ప్రాణకోటికి జీవాధారం జలం. లభ్యత లేకపోతే మనుగడ అసాధ్యం. జనాభా పెరుగుదలకు అనుగుణంగా వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధితో నీటి వినియోగం గణనీయంగా పెరుగుతోంది. కాలుష్యం పెరిగి వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సముద్రాలు వేడెక్కుతుండటంతో భూగోళం మండిపోతోంది. నీరు ఆవిరి కావడం, వనరుల విధ్వంసంతో నీటిలభ్యత తగ్గిపోతోంది. ఇటువంటి పరిణామాలతో నీటి సంక్షోభంతో భవిష్యత్ ఎడారిగా మారే ప్రమాదం నెలకొంది.

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ (వ్యవసాయం)

● నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్ ఎడారే..



నల్లగొండ జిల్లాలో నాలుగేళ్లలో భూగర్భనీటిమట్టాలు(మీటర్లలో)

(ఫిబ్రవరిలో)	2022	2023	2024	2025
నల్లగొండ	4.85	6.05	8.52	8.59
దేవరకొండ	6.14	5.71	10.35	8.44
మిర్యాలగూడ	5.71	6.83	10.76	6.23

ఉమ్మడి జిల్లాలో భూగర్భనీటిమట్టాలు
నల్లగొండ : 7.74
సూర్యాపేట : 3.60
యాదాద్రి : 2.36
(మీటర్లలో)

ప్రపంచానికి 70 శాతం తాగునీరు మంచు పర్వతాలు కరగడం ద్వారా లభ్యమవుతోంది. భూగోళంపై 2.75 లక్షల హిమానీ నదులున్నాయి. 1976- 2023 మధ్యలో 2.10 లక్షల నదులను పరిశీలించగా 2023లో అత్యధికంగా మంచును కోల్పోయినట్లు గుర్తించారు. మంచు కరుగుతూ 2030నాటికి హిమా నీనదులు కుచించుకు పోతాయని నిపుణులు గుర్తి ంచారు. పరిస్థితిని అధ్యయనంచేసిన యునెస్కో, ప్రపంచ వాతావరణ సంస్థలు ఈ ఏడాదిని (2025) అంతర్జాతీయ హిమానీ నదుల పరిరక్షణ సంవత్సరంగా ప్రకటించాయి. భూఉష్ణోగ్రతలు పెరుగుదలను 1.5డిగ్రీల సెల్సియస్ పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అప్రమత్తత కొరవడితే 2050నాటికి హిమానీనదులు పూర్తిగా కనుమరుగై తాగు, సాగు నీటి సమస్య తీవ్రమవుతుందని ఐరాస హెచ్చరిస్తోంది.

జల శక్తి అభియాన్

నీటివనరుల ప్రాముఖ్యాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం 2019లో జల్‌శక్తి అభియాన్‌ను ప్రారంభించింది. వర్షపు నీటిసంరక్షణ, సంప్రదాయ జలవనరులు,చెరువుల పునరుద్ధణ, బోరుబావుల సద్వినియోగం. రీచార్జ్, వాటర్ షెడ్ అభివృద్ధి, అడవుల పెంపకం పనులు ఈ పథకంలో భాగంగా చేపట్టారు. ఈ పథకం ఆశించిన ఫలితాలు సాధించలేక పోయారు.



నీటి నిల్వలపై నీలి నీడలు..

దేశంలో నీటి వనరులు అపారంగా ఉన్నప్పటికి వినియోగంలో ప్రణాళిక లేక పోవడంతో చాలావరకు నీరు వృథా అవుతోంది. వ్యవసాయ విస్తీర్ణం పెంపు, పట్టణీకరణతో నీటి వినియోగం భారీగా పెరిగింది. అడవులు అంతరించడంతో వాతావరణ మార్పులతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదు. నదులు, చెరువుల పరిరక్షణను పాలకులు పట్టించుకోకపోవడంతో సాగు, తాగు నీటి కొరతకు ప్రధాన కారణంగా నిపుణులు తెలుపుతున్నారు.

ఇజ్రాయిల్ ఆదర్శం

నీటి సంరక్షణ చర్యలలో ఇజ్రాయిల్ దేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది. ఏడు దశాబ్దాల కిందట ఏర్పడిన ఈ దేశంలో 60శాతం ఎడారి విస్తరించి ఉంటుంది. ఇక్కడ ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ 80 శాతం వాడిన మురుగునీటిని శుద్ధి చేసి వినియోగిస్తున్నారు. ఈ నమూనానే 150 దేశాలు పాటిస్తూ నీటిని ఆదా చేస్తున్నాయి.



భగవద్గీతలో శ్రీకృష్ణుడు వర్షం(జలం) యొక్క విశేషాన్ని ఇలా వర్ణిస్తారు.

అన్నాద్భవంతి భూతాని
పర్జన్యాదన్నసంభవః
యజ్ఞాద్భవతి పర్జన్యో
యజ్ఞః కర్మసముద్భవః

అన్నము వలన జంతుజాలము పుట్టును. వర్షము వల్ల అన్నము సమకూరును.అని మరింతగా వివరిస్తూ నీటితోనే మానవ మనుగడ ముడిపడి ఉందని చెబుతాడు.

సినిమాల్లోనూ..



మనిషి ప్రాణాన్ని నిలబెట్టే రక్తం ఎంత ప్రాధాన్యమో.. ప్రతి నీటిబొట్టు అంతే సమానమనేలా 'డాకు మహరాజ్' సినిమాలో సినీ హీరో నందమూరి బాలకృష్ణ ఓ డైలాగ్ ఉంటుంది.. అది ఇది..

ట్యాప్ సరిగ్గా కట్టేయ్.. పోతుంది బొట్టే కదా..
నీ ఒంట్లో రక్తం కూడా బొట్టు బొట్టుగా పోతే ఓకేనా..



ఇంద్ర సినిమాలో చిరంజీవి

ఘల్లు ఘల్లు మని సిరిమువ్వల్లే
చినుకే చేరగా..
జడివాన జాడతో ఈ నేల
జన జీవితాలు చిగురించేలా

● నీటిని వృథా చేస్తే ఇతర దేశాల్లో..

● అమెరికాలో నీటిని వృథా చేస్తే రూ.40 వేలకు(ఇండియా కరెన్సీలో) పైగా జరిమానా విధిస్తారు.(రాష్ట్రాలు, ప్రాంతాలను బట్టి ఈ జరిమానా మారుతుంటుంది).

● ఆస్ట్రేలియా దేశంలో రూ.20 వేల వరకు జరిమానా విధిస్తారు. ఒక్కోసారి జైలు శిక్ష కూడా విధిస్తారు.

మీకు తెలుసా

● కుళాయి ధర రూ.40(ప్లాస్టిక్)



● కుళాయికి నల్లా లేక ఏడాదికి వృథా అవుతున్న నీరు 5,500 లీటర్లు

ప్రతి ఇంట్లో ఏడాదికి 45 వేల లీటర్ల నీరు వృథా అవుతోందని అంచనా.



● కుళాయి వదిలి రెండు నిమిషాలు పళ్లు తోముకుంటే వృథా అయ్యే నీరు 8 లీటర్లు

● షేవింగ్ సమయంలో 5 లీటర్ల నీరు వృథా అవుతుంది.



● ప్రతి ఇంట్లో ఏడాదికి సాధారణంగా 45 వేల లీటర్ల నీరు వృథా అవుతోందని అంచనా.



● ప్రపంచంలో ఎక్కువగా నీరు వృథా అయ్యేది మనదేశంలోనే

● ఒక వ్యక్తి రోజుకు 45 లీటర్ల నీటిని వృథా చేస్తున్నాడు.



మరుగుదొడ్డిలో నీటి వినియోగం ఇలా (ఒక్కసారికి)

పాతపద్ధతిలో ఒక్కసారికి 4 లీటర్ల నీటిని వినియోగిస్తారు.



కమోడ్ ఫ్లష్ చేసిన ప్రతీసారి 4 నుంచి 6 లీటర్ల నీటిని వదులుతుంది.

● సగటున నీటి వృథా

● ప్రతీ వ్యక్తి ఏడాదిలో రోజుకు 14 లీటర్ల చొప్పున 5110 లీటర్లు వినియోగిస్తారు.

● ఒక్కరోజులో గృహ నీటి వినియోగం 135 లీటర్లు(వృథా పోను).

● ఒక వ్యక్తి నీటి వృథాను అరికడితే ఐదేళ్లలో ఏడాది సరిపడా నీటిని పొందవచ్చు.



దుశ్చర్ల సత్యనారాయణ పెంచిన అడవిలోని కుంటలో తామరపూలు



చెమ్మనూ పెంచాడు

దుశ్చర్ల సత్యనారాయణ అంటే అందరికీ జల సాధన సమితి పేరుతో ఆయన చేసిన పోరాటం గుర్తుకు వస్తుంది. ఆయనకు ప్రజల కోసం పోరాటం చేయడంతో పాటు ప్రకృతి అంటే కూడా ప్రాణం. చెట్లను, పక్షులను ఎంతలా ప్రేమిస్తారంటే తాను పెంచిన అడవిలో ఒక్క ఫలాన్ని, పుష్పాన్ని కాని ఆయన కోయరు. కోయనివ్వరు. అంతేకాదు జంతుజాలాలు నీటికి అల్లాడకుండా నీటి కొలను సైతం అందులో ఏర్పాటు చేశాడు. ఇందుకోసం వనంలో కురిసే ప్రతి నీటి చుక్క ఒక్కచోటికి చేరేలా చిన్నపాటి కొలనులు ఏర్పాటుచేశారు. దీంతో భూమిలో చెమ్మ పెరిగింది. కలువ పూలతో అక్కడి కొలనులు సుందరంగా దర్శనమిస్తుంటాయి.

(ఆంధ్రజ్యోతి-మోతె)

అడవులు కనుమరుగవుతున్న సమయంలో సత్యనారాయణ సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవాపురంలో తనకు వారసత్వంగా వచ్చిన 70ఎకరాల భూమిలో 20 ఏళ్లుగా కష్టపడి కొత్త అడవిని సృష్టించారు. బ్యాంకు అధికారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సేవలు అందించారు. 30 ఏళ్ల కిందట ఫ్లోరైడ్‌తో ప్రజలు అతలాకుతలం అవుతుంటే జలసాధన జాతీయ సమితిని స్థాపించి ఉద్యమించారు. 300మందితో పార్లమెంట్ స్థానానికి నామినేషన్ వేయించారు. అలా ప్రజాపోరాటాలను ప్రారంభించిన ఆయన ఆ తర్వాత సాగు వైపు మళ్లారు. ఎకరం ఉన్న రైతు కూడా ఏ పంట వేయాలి, ఎంత దిగుబడి వస్తుందని చూస్తున్న ఈ కాలంలో 20ఏళ్లుగా ఏచిన్న చెట్టును కొట్టడంగానీ నేలమీద పడ్డా తొలగించడం గానీ చేయలేదు.

అడవిలో కుంటల తవ్వకం

అడవిలో చెట్లు ఎండిపోకుండా, జంతువులకు, పక్షులకు, మూగజీవాలకు నీటి ఎద్దడి లేకుండా 10ఎకరాలకు ఒకచోట రెండుఎకరాల నుంచి ఐదెకరాల్లోపు కుంటలను తవ్వించాడు. ప్రతీ కుంటకు ఓబోరు వేసి ఆ బోరు నీరు అందులోనే పోస్తూ నిండి అడవిలో కాల్వలకు చేరుతుంది. దీంతో చెట్లకు నీరు చేరుతుంది. అదేవిధంగా 8 బోర్లతో కుంటలల్లో నిండిన నీటిని అడవిలో ఉన్న గుట్టపైకి పైపుల ద్వారా పంపి అక్కడి నుంచి మళ్లి అడవిలోకి వచ్చేట్లు పైపులను అమర్చారు. ఆ నీరు జాలువారుతూ చెట్ల పొదల్లోకి చేరుతుంది. దీంతో భూగర్భజలాలు పెరగడంతో పాటు పచ్చని పైర్లు పెరిగి సాయంత్రం పక్షులు తినేందుకు అక్కడికి చేరుతుంటాయి.

పెరిగిన నీటిలభ్యత

భూగర్భజలాలు అడుగంటుతున్న సమయంలో ప్రతినీటిచుక్కను కాపాడుకోవాలనే ఉద్దేశంతో 70ఎకరాల అడవిలో ఉపాధి హామీ పథకం కింద కుంటలను తవ్వించారు. వర్షపు నీరు పడ్డచోటనే ఇంకిపోయేలా ఇంకుడుగుంతలు, వరద కాల్వల వర్షపు నీరు చెట్లల్లోకి, కుంటల్లోకి వెళ్లేలా కాల్వలు రూపొందించారు. నీటి నిల్వలపై దృష్టిపెట్టడంతో వేసవిలోను అడవిలో ఏమూలనైనా నీటిపదును ఉండడంతో పచ్చని గడ్డి కనిపిస్తుంది. సమగ్ర నీటి సంరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా వేసవిలో పక్షులకు, జంతువులకు ఆహారంతో పాటు నీటిలభ్యత పెరిగింది.

నీటి వృథాపై జరిమానాలు

నీటి వృథాపై అన్ని దేశాల్లోనూ ప్రత్యేక చట్టాలున్నాయి. అయితే అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, నెదర్లాండ్ వంటి దేశాల్లో భారీ జరిమానాలు విధిస్తుంటారు. అయితే మనదేశంలో మాత్రం రూ.1000 వరకు జరిమానా విధిస్తున్నారు. ఇటీవల కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో నీటి ఎద్దడితో వాహనాలను కడిగితే రూ.1000 జరిమానా విధించారు.



ఇంకుడు గుంత.. బోర్ల రీచార్జ్

ఏడాదికేడాది భూగర్భజలాలు అడుగంటుతున్న తరుణంలో నీటి సంరక్షణపై దృష్టి సారించాల్సి వస్తోంది. ఈ తరుణంలో భవిష్యత్ తరాలకు నీటిఎద్దడి ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది. వర్షాలు తగ్గడం, వర్షాల ద్వారా వచ్చే నీరు, బోర్ల ద్వారా వాడుకునే నీరు వృథాగా పోతుండటంతో భూగర్భజలాలు పాతాళానికి పడిపోతున్నాయి. ఈ తరుణంలో నిత్యావసరాలకు వాడుకునే నీటిని తిరిగి భూమిలోకి తరలించేందుకు ఇంకుడు గుంతల ఏర్పాటు అవశ్యం. కొన్నేళ్లుగా ప్రభుత్వం వాటర్‌షెడ్, ఉపాధిహామీ పథకంలో ఇంకుడుగుంతలు, ఆనకట్టలు, బోరు రీచార్జ్ స్ట్రక్టర్ నిర్మాణాలు చేపడుతోంది.

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)



ప్రజలకు వాటిపై సరైన అవగాహన ఇంకుడుగుంతల నిర్మాణాలు అంతంతమాత్రంగా సాగుతున్నాయి. గతంలో మట్టి రోడ్ల వీధులు, ఇళ్ల ముందు, వెనక ఖాళీ స్థలాలు ఉండటంతో వర్షపు నీరు భూమిలో ఇంకేది. ఇప్పుడు సీసీ రోడ్లు, ఇంట్లో వేసే టైల్స్‌తో నీరు ఇంకే అవకాశం లేకుండాపోతోంది. దీంతో బోర్లు వట్టిపోతున్నాయి. వర్షపు నీటిని ఒడిసిపట్టి బోర్లను రీచార్జి చేయడానికి ఇంకుడుగుంతలు ఎంతగానో ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత నిర్మించి వర్షపు నీరు అందులోకి వదిలితే బోరు రీచార్జి అవతుందంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండేళ్ల క్రితం 1,63,455 ఇంకుడుగుంతలు నిర్మించాలన్నది లక్ష్యంగా పెట్టుకోగా 1,05,378 నిర్మించారు. నల్లగొండ జిల్లాలో 1,02,049లకు 54,034 గుంతలు నిర్మించారు. సూర్యాపేట జిల్లాలో 30,820 లకు 25,817, యాదాద్రిభువనగిరి జిల్లాలో 30,586 నిర్మించాల్సి ఉండగా 25,527 నిర్మించారు.

బోరు రీచార్జి స్ట్రక్టర్‌తో నీళ్లు



నేను ఇంటి వద్ద బోరు వేయగా బోరు వేస్తున్నప్పుడు నీరు రాలేదు. మొత్తం దుమ్ము వచ్చింది. ఆ తర్వాత మోటారు బిగిస్తే ఐదారు నిమిషాలకు నీరు పోసి ఆగిపోయేది. బోరు రీచార్జ్ ఇంకుడు గుంత నిర్మించా. సుమారు రూ.12 వేలు ఖర్చయ్యింది. ఇంకుడు గుంత నిర్మించాక ఇప్పుడు గంటపాటు ఆగకుండా నీరు వస్తోంది.

ఎండీ ఇనాయత్ అలీ, మోత్కూరు




ఫొటోలు: (ఆంధ్రజ్యోతి-స్టాఫ్‌ఫొటోగ్రాఫర్,నల్లగొండ)

చెరువు ఎండి చేప కొంగకు ఆహారం

గతేడాది నీటితో కళకళలాడిన నల్లగొండ సమీపంలోని వల్లభరావు చెరువులో చేపలు దుంకుతుండేవి. ఎండవేడిమికి నీటినిల్వలు క్రమంగా తగ్గి చెరువు ఒట్టిపోతోంది. దీంతో చేపలు మృత్యువాతపడుతున్నాయి. ఇదే సమయంలో ఉన్నకొద్దిపాటి నీటిలోని చేపలను తినేందుకు కొంగలు బారుతీరుతున్నాయి.

మునిసిపాలిటీ	జనాభా	నల్లాకనెక్షన్లు	రోజువారీ సరఫరా
మిర్యాలగూడ	1,44,00	22,643	10(ఎంఎల్‌డీ)
దేవరకొండ	39,229	8,489	4.2
చండూరు	16,673	4,035	2.5
హాలియా	22,476	5,355	2.25
చిట్యాల	19,481	4,420	2.6
నాగార్జునసాగర్	15,000	5,000	.3
భువనగిరి	77,000	9536	10
ఆలేరు	22,599	3,665	1.25
మోత్కూరు	21,000	4,000	1.93
చౌటుప్పల్	31,202	6,126	2.5
యాదగిరిగుట్ట	30,000	3,000	1.5
సూర్యాపేట	1,50,000	27,816	2.4
హుజూర్‌నగర్	45,350	9,975	3
తిరుమలగిరి	18,474	3329	2.5
నేరేడుచర్ల	19,218	8,524	1.2

(ఒక ఎంఎల్‌డీ 10 లక్షల లీటర్లతో సమానం)

జంతు సంరక్షణకు

నీటితొట్లు, చెక్‌డ్యాంలు

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)



ట్యాంకర్ల ద్వారా నీటితొట్లలోకి నీరు

నల్లమలలో వన్యప్రాణులు, జంతువుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో నీటితొట్లు, చెక్‌డ్యాంలు, కుంటలు ఏర్పాటుచేశారు. బోర్లు, పైప్‌లైన్లు, ట్యాంకర్ల ద్వారా చెక్‌డ్యాంలోకి, కుంటలు, నీటితొట్లలోకి నీటిని సరఫరా చేసి వన్యప్రాణులు, జంతువులదాహార్తి తీర్చేందుకు చర్యలు చేపడుతున్నారు. నల్లమల అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కింద కంబాలపల్లి, దేవరకొండ రేంజ్ అటవీ ప్రాంతం ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, కర్నూల్ జిల్లాలోని 26,725 హెక్టార్లలో అటవీ విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ 200కుపైగా నీటితొట్లు, 22 చెక్‌డ్యాంలు నిర్మించింది. బోర్లువేసి పైప్‌లైన్‌లు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి వన్యప్రాణులను సంరక్షించేందుకు చర్యలు చేపడుతోంది. దీంతో వన్యప్రాణులు, అటవీ జంతువులు నలమలలో ఏర్పాటుచేసిన నీటి లభ్యత ప్రాంతాల్లో వేసవిలో నీరుతాగి సేదతీరుతున్నాయి.

జలం లేనిదే జీవం లేదు

(ఆంధ్రజ్యోతి-కోదాడటౌన్)



ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టి వృథా చేయకుండా, అవసరానికి తగ్గట్టు వినియోగంలో మార్పులు చేసుకోవాలి. మంచినీటి ప్రాధాన్యాన్ని గుర్తించి ప్రపంచ నీటి సంక్షోభాన్ని పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలి. నీటిని అవసరానికి మించి ఉపయోగించకుండా నీటి, నష్టాన్ని, నీటి కాలుష్యాన్ని నివారించాలి. పర్యావరణాన్ని సంరక్షించడం ద్వారానే భూమిపై సకల ప్రాణులు మనుగడ సాధ్యం. ప్రజలందరికీ పరిశుభ్రమైన తాగునీరు. పారిశుధ్యం అందించడం, నీటిని సద్వినియోగం మంచినీటి వనరుల సంరక్షణపై ప్రజలలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

బడుగుల సైదులు, ఆర్థిక సామాజిక విశ్లేషకులు

సాగర్, మూసీకి పూడిక ముప్పు



నల్లగొండ జిల్లా కేతేపల్లి పరిధిలోని మూసీ జలాశయం

(5వ పేజీ తరువాయి)

క్యూసెక్కుల వరకు తట్టుకునే సామర్థ్యంతో నిర్మించారు.

తగ్గుతూ వస్తోందిలా..

నాగార్జునసాగర్ జలాశయ నిర్మాణ సమయంలో నీటి నిల్వ సామర్థ్యం 408.24టీఎంసీలు (శతకోటి ఘనపుటడుగులు). 2010 నాటికి 312.1456 టీఎంసీలకు తగ్గింది. సాంకేతిక నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం 1967 నుంచి 1974 నాటికి 14.4 టీఎంసీలకు నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. 1978 నాటికి 48.7టీఎంసీలకు, 2001-2009 నాటికి 79.21 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. 2009 అక్టోబరు నెలలో 2, 4వ తేదీల్లో కృష్ణా నదికి వచ్చిన భారీ వరదల్లో ఎక్కువ మొత్తంలో బురద కొట్టుకు వచ్చింది. నాడు 25లక్షల క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరింది. అంటే ఆ సమయంలో నదిలోకి ఎంత మేర బురద వచ్చి చేరిందో అంచనా వేయడం కూడా కష్టం. 2010 నాటికి నీటినిల్వ సామర్థ్యం 96.05 టీఎంసీలకు తగ్గింది. 2016 నాటికి అది సుమారు 108 టీఎంసీలు, 2020 నాటికి 110 టీఎంసీలు, ఈ ఏడాది మార్చి నాటికి సుమారు 112టీఎంసీల పైచిలుకు సాగర్ నీటి నిల్వ సామర్థ్యం తగ్గి ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నీటి కేటాయింపులు

సాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు 132 టీఎంసీలు, ఎడమ కాల్వకు 132 టీఎంసీల నీటి కేటాయింపులు జరిగాయి. ఆవిరి రూపంలో 17 టీఎంసీల నష్టం ఉంటుంది. ఈ నీటితో 22 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కృష్ణా డెల్టాలో వేలాది ఎకరాలకు సాగునీటితో పాటు విద్యుత్ ఉత్పాదన జరుగుతోంది. జంటనగరాలతో పాటు ఆయకట్టు పరిధిలోని ఐదు జిల్లాల్లోని వందలాది చెరువులు నింపి వేలాది గ్రామాలకు తాగునీరు అందిస్తోంది. రాష్ట్రంలోని ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు తాగునీరు సాగర్ జలాశయం నుంచే వెళ్తోంది. ఇంత ప్రాధాన్యం ఉన్న జలాశయంలో పూడిక చేరినా, నివారణపై ప్రభుత్వాలకు శ్రద్ధ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పూడిక నివారణకు నిపుణుల సూచనలు

పూడికను తొలగించడం అనేది జరగదని, కేవలం నివారణ ఒక్కటే మార్గం అని సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు. వీరిచ్చిన సూచనలు ఇలా ఉన్నాయి.

● జలాశయానికి ముందు మినీ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి.

● వరద ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉన్న చోట మట్టి నిలిచేందుకు అడ్డుకట్టలు వేయాలి.

● గుట్టల మీదుగా వచ్చే వరదతో పాటు కొట్టుక వచ్చే రాళ్లు, మట్టిని నివారించేందుకు రాతి కట్టడాలు నిర్మించాలి.

● జలాశయంలో నీరు తగ్గిన సమయంలో ప్రాజెక్టు తీరాల్లో ఉన్న ఆయకట్టేతర ప్రాంతాల్లోని మెట్ట భూముల్లోకి ఒండ్రు మట్టిని ప్రభుత్వ ఖర్చులతో తరలించాలి.

● నది మధ్యలో ఉన్న గుట్టల చుట్టూ రాళ్లు నదిలోకి పడకుండా జాలీలు ఏర్పాటు చేయాలి.

క్యూసెక్కులు.. లెక్కలు

నీటి ప్రవాహాన్ని క్యూసెక్కుల్లో, నీటి నిల్వ సామర్థ్యాన్ని టీఎంసీల్లో లెక్కిస్తారు. క్యూసెక్కు అంటే క్యూబిక్ మీటర్ ఫర్ సెకన్. అంటే ఒక సెకను కాలంలో ప్రవహించే ఘనపుటడుగు నీరు. వెయ్యి క్యూసెక్కుల నీరు విడుదల చేశారంటే సెకనుకు వెయ్యి ఘనపుటడుగుల నీరు విడుదల చేసినట్లు అవుతుంది. ఒక క్యూసెక్కు నీటితో సుమారు 130 ఎకరాల్లో వరి సాగుచేయవచ్చు. ఒక రోజంతా ఇలాగే ఉంటే గంట పాటు జలాశయం నుంచి 11,575 క్యూసెక్కుల నీరు వెళ్తే అది ఒక టీఎంసీతో సమానం. ఒక టీఎంసీ నీటితో 7వేల నుంచి 10వేల ఎకరాల్లో ఒక సీజన్ మొత్తం ఆరు తడి పంటలు సాగుచేయవచ్చు. ఇదే నీటితో 5,400 నుంచి 6,500 ఎకరాల్లో ఒక సీజన్‌లో వరి సాగుచేయవచ్చు. వారబందీ ప్రకారం నీటిని విడుదల చేస్తూ 7,000 నుంచి 7,500 ఎకరాల్లో వరి సాగు చేయవచ్చు. అలాగే ఒక టీఎంసీ నీటితో 6.67 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. 30 నుంచి 50 టీఎంసీల నీటితో హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలో సగానిపైగా ప్రాంతాలకు తాగునీరు అందించవచ్చు.

(5వ పేజీ తరువాయి)

శిథిలావస్థకు చేరిన 10 స్కవర్ గేట్లను కాంక్రీట్‌తో పూర్తి గా సీజ్ చేశారు. శిథిలమైన ప్రాజెక్టు 12 క్రస్ట్, 8 రెగ్యులేట రీ గేట్ల స్థానంలో సుమారు 24 ఏళ్ల అనంతరం 2014లో ప్రభుత్వం నిధులు కేటాయించడంతో కొత్త గేట్లను అమర్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడ, నల్లగొండ నియోజకవర్గాల పరిధిలోని 40 గ్రామాలకు చెందిన 41,800 ఎకరాల్లో వానాకాలం వరి సాగుకు నీటిని అందించేలా లక్ష్యా న్ని నిర్దేశించారు. ఆశించిన మేరకు వరద ప్రాజెక్టుకు చేరకపోవడంతో 1973లో దీన్ని యాసంగిలో ఆరుతడి.. పంటలకు నీటిని అందించే ప్రాజెక్టుగా మార్చిన అధికారులు సాగు విస్తీర్ణాన్ని 33వేల ఎకరాలకు కుదించారు. నిర్మించిన తొలినాళ్లలో నాలుగు నియోజకవర్గాల్లోని 45వేల ఎకరాలకు సాగునీరు, సూర్యాపేట పట్టణానికి తాగునీటిని అందించిన ఘన చరిత్ర ఉన్న ఈ ప్రాజెక్టులో పూడిక చేరడంతో నేడు కేవలం 30వేల ఎకరాలకు సైతం నీటిని అందించలేని దుస్థితికి చేరింది. పూడికతో నిండి నీటినిల్వ సామర్థ్యాన్ని కోల్పోయిన మూసీ ప్రాజెక్టులో పూడిక తొలగించి పూర్తి స్థాయిలో నీటినిల్వకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయకట్టు ప్రాంత రైతు ప్రతినిధులు, రైతులు కోరుతున్నారు.

15.32శాతం పూడికను నిర్ధారించిన సీడబ్ల్యూసీ

కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) గతేడాది హైడ్రోగ్రాఫిక్, రిమోట్ సెన్సింగ్ సాంకేతికతతో నిర్వహించిన సర్వే మూసీకి పూడిక ముప్పును హెచ్చరించింది. దేశవ్యాప్తంగా 87జలాశయాలు పూడిక కారణంతో వేగంగా నీటినిల్వ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయని పేర్కొన్న సీడబ్ల్యూసీ సర్వేలో తెలంగాణలోని ఉస్మాన్‌సాగర్‌తో పాటు మూసీ జలాశయం ఉన్నాయి. మూసీ జలాశయంలో ఇప్పటికే 15.32శాతం మేర సెడిమెంటేషన్(పూడిక) ఉందని పరిరక్షణ చర్యలు తప్పనిసరని ఈ సర్వే సూచించింది. 4.46టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మితమైన మూసీ నిర్మించిన నాటి నుంచి 2024వరకు 0.74టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయి ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 3.72టీఎంసీలకు పడిపోయిందని పేర్కొంది. మూసీలో పూడిక తొలగింపు, పరిరక్షణ చర్యలు చేపట్టకుంటే 2084నాటికి జలాశయ సామర్థ్యం ఒక టీఎంసీ మేర తగ్గిపోతుందని హెచ్చరించింది.

ఫేక్‌కాల్స్‌తో పరేషాన్

● ఆస్తిపన్ను వసూళ్లు అంటూ ఫోన్లు
● పన్ను బకాయిని మా ఖాతాలో వేయండంటూ యజమానులకు కాల్స్
● అప్రమత్తంగా ఉండాలంటున్న మునిసిపల్ అధికారులు



భువనగిరి టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను చెల్లింపుదారులకు కూడా ఫేక్‌కాల్స్ ముప్పు తప్పడం లేదు. ఇప్పటికే ఫేక్‌కాల్స్‌తో పలువురిని ఆర్థికంగా మోసం చేస్తున్న చెల్లింపుదారులను కూడా వదిలి పెట్టడంలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో భువనగిరి మునిసిపాలిటీలో 100శాతం పన్ను వసూలు లక్ష్యంగా అధికారులు సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. బకాయిదారుల జాబితా ఆధారంగా ఫోన్లు చేయడంతోపాటు ఇంటికి వెళ్లి పన్నును వసూలు చేస్తున్నారు. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు తాము మునిసిపల్ కార్యాలయంనుంచి మాట్లాడుతున్నామని ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ఫోన్లు చేస్తూ పన్ను బకాయిని తమ ఖాతాలకు ఫోన్ పే, గూగుల్‌పే తదితర ఆన్‌లైన్ విధానాల్లో జమచేయాలని, చెల్లించిన వెంటనే రశీదు జనరేట్ అవుతుందని నమ్మబలుకుతున్నారు. ఈక్రమంలో శుక్రవారం పలువురికి ఈతరహా ఫేక్ కాల్స్ వెళ్లాయి.

పన్ను చెల్లించిన వ్యాపారికి ఫోన్‌కాల్

అప్పటికే పన్ను చెల్లించిన ఓ వ్యాపారి తనకు వచ్చిన ఫోన్‌కాల్‌పై అనుమానం వచ్చి మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే అప్రమత్తమైన మునిసిపల్ సిబ్బంది ఫేక్‌కాల్స్‌పట్ల జాగ్రత్తగా ఉండాలని పన్ను చెల్లింపుదారులకు సూచించారు. ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించేవారు మునిసిపల్ ఖాతాకే బదిలీ చేయాలని, లేదా తమ ప్రాంత బిల్ కలెక్టర్లుకు పన్ను చెల్లించి వెంటనే రశీదు పొందాలని, వీలైతే మునిసిపల్ కార్యాలయానికి నేరుగా వచ్చి పన్ను చెల్లించాలని సూచిస్తున్నారు. అయితే ఇదే తరహా ఫేక్‌కాల్స్ అన్ని మునిసిపాలిటీల పరిధిలో పన్ను చెల్లింపుదారుకలు వెళ్లే ప్రమాదం ఉన్నందున మునిసిపల్ యంత్రాంగం, భవన యజమానులు జాగ్రత్తగా ఉండాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

ఫేక్‌కాల్స్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తాము

భువనగిరి మునిసిపల్ పరిధిలో ఆస్తిపన్ను చెల్లింపుదారులకు శుక్రవారం ఫేక్‌కాల్స్ వచ్చినట్లు సమాచారం వచ్చింది. దీంతో మా సిబ్బందిని, పన్ను చెల్లింపుదారులను అప్రమత్తం చేశాం. వ్యక్తిగత ఖాతాకు పన్ను మొత్తాన్ని బదిలీ చేయమని మునిసిపల్ సిబ్బంది కోరబోరు. అలా అడిగితే ఫేక్‌కాల్స్‌గా భావించి మునిసిపల్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. ఫేక్‌కాల్స్‌పై ఫిర్యాదు చేస్తాం.

జి.రామలింగం, కమిషనర్, భువనగిరి మునిసిపాలిటీ

బ్యాంకులకు సెలవులు

● వరుసగా నాలుగు రోజులు..
● నేడు, రేపు సాధారణ సెలవులు.. 24, 25 ఉద్యోగుల సమ్మె
● ఉమ్మడి జిల్లాలో 6 వేలకు పైగా ఉద్యోగులు



భువనగిరి టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నేటినుంచి వరుసగా నాలుగు రోజులపాటు బ్యాంకు కార్యకలాపాలు స్తంభించనున్నాయి. శని, ఆది వారాలు సాధారణ సెలవులు కాగా, తమ డిమాండ్ల సాధనకు బ్యాంకు ఉద్యోగులు 24, 25న సమ్మెబాట పట్టనున్నారు. ఈపాటికే యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ సమ్మె నోటీసు ఇచ్చింది. దీంతో ప్రైవేట్ బ్యాంకులు మినహా రాష్ట్ర, జాతీయ ప్రభుత్వరంగ బ్యాంకుల ఉద్యోగులందరూ ఆ రెండు రోజులపాటు సమ్మెలో పాల్గొననున్నారు. దీంతో వరుసగా నాలుగురోజులపాటు ఉమ్మడి జిల్లాలో బ్యాంకింగ్ సేవలకు తీవ్ర అంతరాయం కలగనుంది. అయితే ఏటీఎంలు యథావిధిగా నగదు సేవలు అందిస్తాయని సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులు పేర్కొన్నారు. వరుసగా నాలుగు రోజులపాటు బ్యాంకులు బంద్ కానుండడంతో పలు రంగాలకు ఇబ్బందులు కలగనున్నాయి. వ్యాపారులు, బిల్లుల చెల్లింపులు, జమ నగదు బదిలీలకు, డీడీలు తదితర సేవలకు అంతరాయం కలగనుంది. అయితే ఆన్‌లైన్ ఆధారిత నెట్ బ్యాంకింగ్, యూపీఐ, కార్డు పేమెంట్స్ తదితర సేవలను యథావిధిగా పొందవచ్చు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో అన్ని యాజమాన్యాల ప్రభుత్వ రంగాల బ్యాంకులు సుమారు 600 వరకు ఉన్నాయి. వీటిలో సుమారు 6 వేల మందికిపైగా విధులు నిర్వర్తిస్తున్నారు. వరుస నాలుగు రోజుల సెలవుల అనంతరం మరో నాలుగు రోజుల వ్యవధితో ఈ నెల 30న ఆదివారం, ఏప్రిల్ 1న రంజాన్ సెలవులు రానున్నాయి. అనగా 11 రోజుల వ్యవధిలో బ్యాంకులు ఏడు రోజులు తెరుచుకోక కేవలం నాలుగు రోజులు మాత్రమే పని చేయనున్నాయి. కాగా సమ్మె విరమణకు బ్యాంకింగ్ అధికారులు యూఎస్‌బియూ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారని జిల్లా యూనియన్ నాయకులు పేర్కొంటున్నారు. అయితే ప్రైవేట్ బ్యాంకులు సమ్మె రోజుల్లో మాత్రం యధావిధిగా పనిచేయునుండగా సెలవు రోజుల్లో మాత్రం మూతపడనున్నాయి.

ప్రధాన డిమాండ్లు

● 2024 ఫిబ్రవరి సమ్మె విరమణ ఒప్పందంలో భాగంగా ఇచ్చిన బ్యాంకులు ఐదు రోజుల పని దినాల విధానాన్ని వెంటనే అమలుచేయాలి.

● క్లరికల్, సపోర్టింగ్ స్టాఫ్ నియామకాలు చేపట్టాలి.

● పెన్షన్ విధానాన్ని సవరించడంతోపాటు పలు డిమాండ్లతో బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు వెళ్తున్నారు. కాగా అన్ని బ్యాంకుల ఖాతాదారులు తమ సమ్మెకు మద్దతివ్వాలని ఉద్యోగులు కోరుతున్నారు.

అక్షర పురస్కారాల విజేతలు వీరే

చౌటుప్పల్ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని అక్షర కళాభారతి సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి లో వివిధ సేవా రంగాల్లో ఎంపిక చేసిన అక్షర పురస్కార గ్రహీతలను ఆ సంస్థ అధ్య క్షుడు మోటె సత్తయ్య, ప్రధాన కార్యదర్శి బడుగు శ్రీరాములు చౌటుప్పల్‌లో శుక్రవారం ప్రకటించారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది అక్షర పురస్కారానికి హైదరాబాద్‌కు చెందిన సీఎండీ ఆఫ్ ఆర్క్ గ్రూప్, క్రెడాయ్ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి గుమ్మి రామ్‌రెడ్డి ఎంపికయ్యారు. శ్రీ క్రోధి నామ సంవత్సర అక్షర సేవా పురస్కారాలకు దేవర కొండకు చెందిన సాహితీ సేవామూర్తి వనం చంద్రమౌళి, భువనగిరికి చెందిన ప్రముఖ కవి దండమూడి చరణ్ ఎంపిక య్యారు. అలాగే చౌటుప్పల్ పట్టణానికి చెందిన ఎదునోజు నర్సింహచారి, బడుగు బలరాములు, యాట వెంకటేశం, రాళ్ల శివం రాములు, సంస్థాన్ నారాయణపురానికి చెందిన సాధు వెంకన్న వివిధ కేటగిరి కింద ఎంపి కయ్యారు. అక్షర కళాభారతి,సాహితీ, సాంస్కృతిక సంస్థ 31వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 29 న స్థానిక గట్టు శ్రీరాములు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో పురస్కారాలను అందజే యనున్నట్లు పేర్కొన్నారు

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	519.60
టీఎంసీలు	148.5482
ఎడమకాల్వకు నీటి విడుదల	7190
కుడికాల్వకు	7.033
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	19,454క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	16,023క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.58 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46 (టీఎంసీలు)
ప్రస్తుత నీటి మట్టం	629.82 అడుగులు
టీఎంసీలు	1.37 (టీఎంసీలు)
కాల్వలకు విడుదల	362.88 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	428.61 క్యూసెక్కులు

ఇద్దరు విలేకర్లపై కేసు

మఠంపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో దురుసుగా మాట్లాడి విధులకు ఆటంటకం కలిగించిన రాజ్ న్యూస్ విలేకరి కాంపాటి సందీప్, సోషల్ మీడియా నిఘా న్యూస్ విలేకరి వెంకట్‌యాదవ్‌లపై కేసు నమోదైంది. మఠంపల్లి ఎస్‌ఐ పి.బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి తహసీల్దార్ కార్యాలయానికి కాంపాటి సందీప్ వెళ్లి ఉద్యోగులతో దురుసుగా మాట్లాడి విధులకు ఆటంకం కలిగించి ఫొటోలు, వీడియోలు తీశాడన్నారు. వీటిని వెంకట్‌యాదవ్‌కు పంపగా, ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేసి సిబ్బందిని బెదిరించారని తెలిపారు. మఠంపల్లి తహసీల్దార్ మంగా పోలీస్‌స్టేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయంలో, ఇంటిలో చోరీ : రూ.4లక్షల సొత్తు అపహరణ

ఆత్మకూర్(ఎస్), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఆత్మ కూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్ సీతారామ ఆలయంలో, కోటి నాయక్ తండాలోని కోమటిరెడ్డి ఉపేందర్‌రెడ్డి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు రామాలయంలోని గర్భగుడి తలుపులు ధ్వంసం చేసి లోపలకు వెళ్లి రూ.1.20లక్షల విలువైన హనుమాన్ వెండి విగ్రహంతో పాటు మరికొన్ని వెండి ఆభరణాలను అపహరించారు. మండలంలోని కోటినాయక్ తండాలో కోమటిరెడ్డి ఉపేందర్‌రెడ్డి దంపతులు ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లగా ఇంటి తాళాన్ని దొంగలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించి బీరువాలో దాచిన రూ.2.70లక్షలు విలువైన మూడు తులాల బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు అపహరించారు. ఉపేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండెపోటుతో రైతు మృతి

పెన్‌పహాడ్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో రైతు మృతిచెందిన ఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్ గ్రామంలో శుక్రవారం జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దోసపహాడ్ గ్రామానికి చెందిన కొండేటి వెంకట్‌రెడ్డి(60)తన కున్న నాలుగు ఎకరాల వరి పొలంలో ట్రాక్టర్ పంపుతో మందు పిచికారి చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటు వచ్చి అక్కడక్కడే మృతిచెందాడు. సమీపంలోని రైతులు గమనించి వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

యువకుడిపై దాడి కేసులో ఆరుగురిపై కేసు

నాగారం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై దాడి కేసులో పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. నాగారం ఎస్‌ఐ ఎం ఐలయ్య తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన వేముల భరత్‌కుమార్, ఈదుల కిరణ్‌కుమార్‌లు రెండు వారాల క్రితం ఫోన్‌లో పరస్పరం దూషించుకున్నారు. ఈ నెల 18న నాగారం బంగ్లా వద్ద వైన్‌షాపులో ఉన్న భరత్‌ను గమనించిన ఈదుల కిరణ్ తన అనుచరులతో కర్రలతో భరత్‌పై దాడి చేసి గాయపర్చారు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయమైన భరత్ నాగారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కిరణ్‌కుమార్‌తో పాటు దాడిలో పాల్గొన్న మరో ఐదుగిరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోచంపల్లిలో 'ఫ్యాషన్'విద్యార్థినులు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని జేడీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీకి చెందిన 120 మంది విద్యార్థి బృందం శుక్రవారం భూదాన్ పోచంపల్లి సందర్శించారు. పట్టణంలోని కళా పునర్వి హ్యాం డ్లూమ్ యూనిట్‌ను సందర్శించి లీవ్ టు క్లాత్ ప్రాసెసింగ్‌ను పరిశీలించారు. చేనేత టైఅండ్‌డై ఇక్కత్ డిజైన్లు చూసి కళాకారులు కళాత్మక నైపుణ్యాన్ని ప్రశం॰ంచారు. అనంతరం చేనేత కార్మికుల మగ్గాలు సందర్శించారు. మగ్గాలపై చేనే త వస్త్ర తయారీని పరిశీలించారు. సంద ర్భంగా కార్మికుల జీవన స్థితిగతులను అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో ఇని స్టిట్యూట్ హెచ్‌వోడీ దిశ, అధ్యాపకులు ప్రియా సిమన్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లి ఇక్కత్ చీర భళా..



ఇక్కత్ పట్టు చీరలో అలరించిన మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా

భూదాన్‌పోచంపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ పట్టుచీరలో బాగున్నట్లు 2024 మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా ప్రశంసించారు. హైదరాబాద్‌లో మే 7 నుంచి 24 రోజుల పాటు మిస్ వరల్డ్ పోటీలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో క్రిస్టినా పిజ్కోవా బేగంపేట లోని ప్లాజా హోటల్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి భూదాన్‌పోచంపల్లికి చెందిన 'ఆర్‌బీ పోచంపల్లి హ్యాండ్లూమ్ హ్యాండిక్రాఫ్ట్' కంపెనీ యజమాని ఆర్‌బీ బాలసుబ్రహ్మణ్యంను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించడంతో ఆయన ఆమెను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పోచంపల్లి చేనేత డబుల్ ఇక్కత్ చీరను ప్రత్యేకతను క్రిస్టినా పిజ్కోవాను మర్యాద పూర్వకంగా కలిసి వివరించారు. ఖండాంతర ఖ్యాతి గాంచిన పోచంపల్లి ఇక్కత్ చీరను ఆమె ధరించి అలరించారు. ఈ సందర్భంగా ఆర్‌బీ బాలసుబ్రహ్మణ్యం క్రిస్టినా పిజ్కోవాను పోచంపల్లిని త్వరలో సందర్శించాలని కోరారు.

లైంగిక దాడి కేసులో ఇద్దరి అరెస్టు

● పరారీలో మరో యువకుడు

హుజూర్‌నగర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఇటీవల ఓ యువతిపై అత్యాచారం కేసులో ఇద్దరిని (ఓ యువకుడు, ఓ మహిళను) అరెస్టు చేసినట్లు సీఐ చరమందరాజు తెలిపారు. శుక్రవారం పట్టణంలో సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన నూకతొట్టి ప్రమోద్‌కుమార్‌కు మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన మహిళతో పరిచయం ఏర్పడింది. మహిళ గతంలోనే చౌటపల్లికి చెందిన కాశయ్యతో 12ఏళ్ల క్రితం వివాహం కాగా, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త చనిపోడంతో మహిళ హుజూర్‌నగర్‌కు వచ్చి దుస్తుల దుకాణం నడిపింది. అనారోగ్యంతో దుకాణం తీసేసి ఒంటరిగా ఉంటోంది. కాగా, మహిళకు ఏడు నెలల క్రితం తిలక్‌నగర్‌కు చెందిన ప్రమోద్‌కుమార్, లచ్చిమళ్ల హరీష్‌లతో పరిచయం ఏర్పడింది. ఆమెకు ప్రమోద్‌కుమార్‌కు సాన్నిహిత్యం ఏర్పడింది. అనంతరం మహిళకు మేళ్లచెర్వుకు చెందిన మరో యువతితో పరిచయం కలిగింది. మహిళ ఆ యువతికి ప్రమోద్‌కుమార్, హరీష్‌ను పరిచయం చేసింది. ఆ యువతిని ప్రమోద్‌కుమార్ మాట్లాడాలని ఈ నెల ఏడో తేదీన కొత్త బస్‌స్టేషన్ వద్ద ఉన్న ఎస్వీ లాడ్జికి పిలిపించి మద్యం తాగించి లైంగిక దాడి చేశాడు. అదే సమయంలో ఫొటోలు, వీడియోలు తీసుకున్నాడు. ఆ తర్వాత బాధితురాలు స్పృహలోకి రాగానే అత్యాచారం చేసిన విషయాన్ని చెప్పి, వీడియోలు కూడా తీశానని, తాను ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలని, లేనట్లయితే వీడియోలు బయట పెడతానని బెదిరించాడు. ఇదే విషయాన్ని ప్రమోద్‌కుమార్ హరీష్‌కు కూడా చెప్పాడు. ఈ నెల 18న ప్రమోద్‌కుమార్, హరీష్‌కుమార్‌లు మహిళ ద్వారా బాధిత యువతిని హుజూర్‌నగర్‌కు పిలిపించారు. బాధిత యువతి మహిళ ఇంటికి రాగా ఆమెను ముగ్గురూ కలిసి కారులో ఎక్కించుకుని రిజిస్ట్రేషన్ ఆఫీస్ వెనక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ బాధిత యువతిని శారీరకంగా కలవాలని ప్రమోద్‌కుమార్, హరీష్‌లు బెదిరించారు. బాధితురాలు నిరాకరించడంతో ప్రమోద్‌కుమార్, హరీష్, మహిళలు బాధితురాలిపై కర్రలతో దాడి చేసి దుస్తులు చించి, చంపుతామని బెదిరించి కారులో బంధించారు. బాధిత యువతి కేసు పెడుతుందోనని భయపడి ఆమెకు, తమనకు ఎలాంటి సంబంధం లేదని బాండ్ పేపర్ రాసి బాధితురాలితో సంతకం తీసుకుని వదిలివేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ముత్తయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం సాయిబాబా థియేటర్ రోడ్డులో ఉన్న ప్రమోద్‌కుమార్, మహిళను అరెస్టు చేశామన్నారు. మరో నిందితుడు లచ్చిమళ్ల హరీష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ప్రమోద్, మహిళనుంచి కారు, రెండు సెల్ ఫోన్లు, బాధితురాలి నుంచి రాయించుకున్న బాండ్ పేపర్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రమోద్‌కుమార్‌ఖపై హుజూర్‌నగర్, గరిడేపల్లి, మఠంపల్లి మండలాల్లో ఏడు కేసులు ఉన్నట్లు సీఐ చరమందరాజు తెలిపారు.

ప్రజలకు ఉపయోగమైన పరిశోధనలు చేయాలి

● ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్

నల్లగొండ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపయోగమైన పరిశోధనలు జరగాలని ఎంజీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ అన్నారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగంలో ఆధునాతన ప్రయోగశాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సవాళ్లకు పరిష్కారాల దిశగా అభ్యసనం ఉత్తమ ఫలితాలను ఇస్తున్నట్లు రుజువైందని గుర్తు చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, ప్రిన్సిపాల్ డా. కె ప్రేమ్‌సాగర్, సైన్సెస్ డీన్ ఆచార్య వసంత, సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, విభాగ అధిపతి డాక్టర్ కొప్పుల సత్తిరెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో మన గళం

బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయలేదు

● దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఒక్క రేషన్‌కార్డు కూడ మంజూరు చేయలేదని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఒకేసారి రూ.లక్ష రుణమాఫీ చేస్తామని, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తామని హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో వెయ్యి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కూడ నిర్మించలేదన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పాలనలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ప్రకటించిన విధంగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసినట్లు గుర్తు చేశారు. దేవరకొండ నియోజకవర్గంలోని 4,670 మంది రైతులకు రూ.350 కోట్లు రుణమాఫీ అయిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వా న్ని విమర్శించడం మాజీ మంత్రి హరీ‌ష్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తగదన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): యాద గిరి గుట్ట లక్ష్మీనర సింహ స్వామి దివ్య క్షేత్రంలో గురువారం నిత్య కైంక ర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి గజ వాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవ మూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విష్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామి అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేప ట్టారు. పాత గుట్ట ఆలయంలో నిత్య పూజలు సంప్రదాయ రీతిలో జరిగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

నేడు ప్రభుత్వ మహిళా కళాశాలలో జాబ్‌మేళా

నల్లగొండ క్రైం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కాకతీయ సెక్యూరిటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల, అటానమస్‌లో ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసరాజు తెలిపారు. ఈ జాబ్ మేళాకు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్‌లో ఉత్తీర్ణులైన, ఫెయిల్ అయిన వారు వినియోగించుకోవాలని అన్నారు. ఈ జాబ్‌మేళా ప్రత్యేకంగా విద్యార్థినుల కోసమే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

శాలిగౌరారం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా విద్యాపరంగా ఎదిగినప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎంపీడీవో గార్లపాటి జ్యోతిలక్ష్మి అన్నారు. మండలంలోని తిరుమలరాయినిగూడెం గ్రామంలో శుక్రవారం పశువుల పాకను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో జంగమ్మ, ఏపీఎం రాములు, ఈసీ వెంకటాచారి, టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి పనులు అక్కడే

» చిట్యాల పట్టణంలో ఆగిన అభివృద్ధి » నిధుల కొరత నిలిచిన పనులు » పనులు పూర్తి చేయాలని ప్రజల డిమాండ్


చిట్యాలలో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మునిసిపల్ పార్క్

చిట్యాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీలో నిధుల కొరతతో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కొన్ని ప్రారంభమై సగం పనులు అయ్యాక నిలిచిపోతే, మరికొన్ని ప్రారంభమే కాలేదు. చి ట్యాలలో రూ.రెండు కోట్ల రూపాయల అంచనా వ్య యంతో ప్రారంభించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. కూరగాయలు, మటన్, చేపల మార్కెట్ కోసం నిర్మిస్తున్న ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు నిధుల లేమితో నిలిచిపోయాయి. రెండు ఫ్లోర్ల స్లాబు వరకు మాత్రమే పూర్తయింది. మార్కెట్ పూర్తి కాకపోవడంతో స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో తాత్కలిక మార్కెట్



ఏర్పాటు చేసినప్పటికీ మటన్, చేపలు విక్రయాలు రోడ్డు పక్కనే నిర్వహిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణపు పనులు పూర్తి కావాలంటే సుమారు మరో రూ.2.5 కోట్లు అవసరం ఉంటుంది.

అలాగే మునిసిపాలిటీలో రూ.15 లక్షల అంచనా వ్యయంతో ప్రారంభించి న మునిసిపల్ పార్కు ఏర్పాటు పనులు కూడా అర్థాంతరంగా నిలిచిపోయాయి. కొంతమేర పనులు పూర్తయినప్పటికీ ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ పనులకు మరో రూ.20 లక్షలు అవసరం ఉంటుంది. అలాగే ఎన్నికల ముందు శంకుస్థాపనలు చేసిన కొన్ని పనులు ఇంకా ప్రారంభం కాలేదు. 12వ వార్డులో బీసీ కమ్యూనిటీ హాల్, 2వ వార్డులో కమ్యూనిటీ హాల్ ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మునిసిపల్ పార్కు పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అలాగే ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు కాగానే ప్రారంభిస్తాం

నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. నిధులు ఉన్నంత వరకు పనులు జరిగాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పూర్తి కావాలంటే మరో రెండున్నర కోట్లు, మునిసిపల్ పార్కు కోసం మరో రూ.20లక్షలు కావాల్సి ఉంది.

- గౌతమ్, ఇన్‌చార్జి ఏఈ

త్వరగా నిర్మాణం పూరి చేయాలి



ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మునిసిపల్ పార్కు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి. ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

- కోనేటి ఎల్లయ్య, చిట్యాల

నేడు నెమ్మానిలో ప్రపంచ జల దినోత్సవం

నార్కట్‌పల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని నార్కట్‌పల్లి మండలంలోని నెమ్మాని రైతు వేదికలో జిల్లా భూగర్భ జలశాఖ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించనున్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

గట్టుప్పల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్ అన్నారు. వెల్మకన్నె గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే నిధులతో ఎల్‌ఈడీ లైట్లను మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కంపె దుర్గయ్య, చాపల మారయ్య, టేకుమట్ల శ్రీరాములు, బీమనపల్లి రమేష్ పాల్గొన్నారు.

రైతు సంఘం మహాసభను విజయవంతం చేయాలి

మర్రిగూడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): చింతపల్లిలో ఈ నెల 23వ తేదీన నిర్వహించే రైతుసంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి గుర్రం శేఖర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. చింతపల్లి మండలంలో జిల్లా స్థాయిలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

బడ్జెట్‌లో బీసీలకు మొండిచేయి

● విశ్రాంత ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డు ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్

నల్లగొండ క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ బీసీలకు మొండి చేయి చూపిందని విశ్రాంత ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం రాజకీయ పార్టీలు, కుల సంఘాల ఆధ్వర్యంలో 'బడ్జెట్ - బహుజనులు' అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బీసీలకు ఆమోదయోగ్యంగా లేదని, 50 శాతం ఉన్న బీసీలను ప్రభుత్వం బడ్జెట్‌లో విస్మరించిందని ఆరోపించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు నేలపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు రూ.50వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ. 11,405 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన అన్ని పార్టీలు బీసీలకు అన్యాయం చేస్తూనే ఉన్నాయని అన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు నల్ల సోమమల్లయ్య, కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు నాగార్జున, వివిధ పార్టీల నాయకులు బొర్ర సుధాకర్, పర్వతాలు, కత్తుల షణ్ముక, గుండు వెంకటేశ్వర్లు, కంది సూర్యనారాయణ, నర్సింహ, కన్నెబోయిన నర్సింహయాదవ్, పెరిక రాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల పెండింగ్ వేతనాలను చెల్లించాలి


బీఆర్ఏఓయూ వీసీని కలిసిన మధు

నల్లగొండక్రైం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పని చేస్తున్న అధ్యాపకులకు ఐదేళ్లుగా వేతనాలు చెల్లించడం లేదని, వెంటనే అధ్యాపకుల వేతనాలను చెల్లించాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పెరిక మధు అన్నారు. హైదరాబాద్‌లో బీఆర్ఏఓయూ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణిని శుక్రవారం కలిసి పలు విషయాలను వీసీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ వేతనాలు అందక అధ్యాపకులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు చెల్లించాలని కోరారు. అధ్యాపకులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన వీసీ ఘంటా చక్రపాణి రానున్న వారం రోజుల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటినీ విడుదల చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ కానుకల లెక్కింపు

చండూరురూరల్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): చండూరు మండలం తుమ్మలపల్లి పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయ కానుకలను శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొబ్బరి కాయల వేలం పాట ద్వారా రూ. 5.06లక్షలు, లడ్డు పులిహోర రూ.3.52 లక్షలు, కొబ్బరి చిప్పలు సేకరణకు రూ. 38 వేలు, ఫొటో కెమెరాకు రూ. 18వేలు, స్వామివారి కల్యాణం రోజున కట్నాలు రూ.56 వేలు, విమాన రథోత్సవం రోజున కట్నాలు రూ. 2.89 లక్షలు, తైబజార్ రూ.46 వేలు, కోడెల వేలం రూ.63 వేలు, అభిషేకం టికెట్స్ రూ.1.23 లక్షలు, అర్చన టికెట్లు రూ.88 వేలు, హుండీ రూ.3.15 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి అంబటి నాగిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ గునరెడ్డి రమ్య రామలింగారెడ్డి, ధర్మకర్తలు, బోయపల్లి రాములు, జిల్ల నర్సింహ, కురుపాటి వెంకటమ్మ, కారువంగ నర్సింహశర్మ, గ్రామ పెద్దలు గజ్జల చిన్నపురెడ్డి, గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆలయ అర్చకులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

మనస్తాపానికి గురై మహిళ ఆత్మహత్య


దోటి తిరుపతమ్మ (ఫైల్)

మునుగోడు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురైన ఓ మహిళ క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని జక్కలవారిగూడెంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... జక్కలవారిగూడెం గ్రామానికి చెందిన దోటి తిరుపతమ్మ (40), భర్త దోటి లింగయ్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఉంటున్నారు. భార్యాభర్తలు వ్యవసాయంతో పాటు మేకలను సాదుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. కొంత కాలంగా వారు పెంచుతున్న మేకలు వరుసగా మృతి చెందుతున్నాయి. ఎంతో కష్టపడి మేకలను సాదుకుంటే చేతికందే సమయానికి మేకలు మృతి చెందుతుండటంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. దీంతో తిరుపతమ్మ శుక్రవారం ఉదయం 6 గంటలకు క్రిమి సంహారక మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. భర్త దోటి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

● మిషన్ అంబేడ్కర్ రాష్ట్ర అధ్యక్షుడు రొయ్య నర్సింహ


ఇఫ్తార్ విందులో పాల్గొన్న రొయ్య నర్సింహ, ముస్లింలు

గట్టుప్పల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని మిషన్ అంబేడ్కర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రొయ్య నర్సింహ అన్నారు. గట్టుప్పల్ మండలంలోని వెల్మకన్నె గ్రామంలో శుక్రవారం ఆయన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా జీవించడమే భిన్నత్వంలో ఏకత్వమని, అది భారతదేశానికి మాత్రమే సొంతమన్నారు. కార్యక్రమంలో మిషన్ అంబేడ్కర్ సంస్థ నాయకులు రాంపల్లి తిరుమలేష్, రొయ్య యాదయ్య, దోటి వెంకటేష్, గ్రామస్థులు షేక్ యాసుఫ్ సదర్, షేక్ నూర్ మహమ్మద్, సయ్యద్, లతీఫ్, హుస్సేన్, నవమన్, షేక్ షరీఫ్, రావుల రవి, శ్రీరాములు, పెంటయ్య పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి వెళ్లిన బీఆర్ఎస్వీ నేతల అరెస్టు

నల్లగొండ క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన నిధులు కేటాయించలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి పలువురు బీఆర్ఎస్వీ నాయకులు అసెంబ్లీ ముట్టడికి వెళ్లగా అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్‌తో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేసి షహనాజ్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కుర్వ పల్లయ్య, జెట్టి శివ, అంబటి ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి


నాంపల్లిలో మెడికల్ ఆఫీసర్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఆశా కార్యకర్తలకు పారితోషికాల విధానం రద్దు చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట శుక్రవారం ఆశా వర్కర్లు ధర్నా చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం అందుబాటులో ఉంటూ పేదలకు ఆరోగ్య సేవలందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, అన్ని సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. వారికి కనీస వేతనం అందజేయాలని కోరారు. ప్రభుత్వం ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను వెంట నే అమలు చేయాలన్నారు. పనిభారం తగ్గించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం వైద్యాధికారులకు వినతిపత్రా లు అందజేశారు.

● నాంపల్లిలో మండలకేంద్రంలో పీహెచ్‌సీ వద్ద ఆందోళ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి మాట్లాడారు. మూడో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు సిర్ర మమత, నాయకులు యాదమ్మ, అరుణ, సైదమ్మ, కవిత, సునీత, లలిత, అండాలు, రేణుక, శంకరమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాలలో తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీ ఎదుట ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు గంగుల జయ మ్మ, ఆశాలు పోశబోయిన సైదమ్మ, పుష్పలత, భాగ్యమ్మ, లక్ష్మి, రేణుక, నీరజ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

● మర్రిగూడలో పీహెచ్‌సీ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తలోజు రామలింగాచారి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏర్పుల యాదయ్య, ఆశా వర్కర్లు భాగ్యమ్మ, పద్మ, దుర్గమ్మ, సునీత, అరుణ, వసంత, బాలమణి ఉన్నారు.

● మునుగోడులో సీఐటీయూ ఆశా వర్కర్ల యూనియన్ మునుగోడు ఏరియా అధ్యక్షురాలు వనం నిర్మల మాట్లాడారు. హైదరాబాద్‌లో రాష్ట్ర కమిటీ పిలుపు నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి అనుమతి ఇ వ్వాలని అన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నర్మద, ఆశావర్కర్ల యూనియన్ సభ్యులు మమత, పద్మ, పుష్పమ్మ, కవిత, ధనలక్ష్మి, సైదమ్మ, గంగజ్యోతి, మమత, నాగమణి, కమలమ్మ, వసుమతి, వరలక్ష్మి, అలివేలు పాల్గొన్నారు.


కట్టంగూరులో పీహెచ్‌సీ ఎదుట ప్లకార్డులతో ఆశా కార్యకర్తల నిరసన

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

● డీఆర్‌డీఏ అదనపు పీడీ శారద



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ అదనపు పీడీ శారద

నల్లగొండక్రైం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని డీఆర్‌డీఏ అదనపు పీడీ శారద అన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు చెందిన సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆపదమిత్ర వలంటీర్లకు హెచ్ఐవీ, సుఖ వ్యాధులపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. జిల్లాలో ఎయిడ్స్ నిర్మూలనకు కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్స్ వివిధ స్వచ్ఛంద సంస్థలు పని చేస్తున్నాయని, ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలన కు కృషి చేయాలని అన్నారు. డీఆర్‌డీఏ పీపీఎం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవడానికి నిరాకరించకుండా అందరూ సంపూర్ణ కేంద్రాలకు వెళ్లి టెస్టులు చేయించుకొని సలహాలు, సూచనలు పాటిస్తూ ముందుకెళ్లాలన్నారు. ఫోర్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్, డిస్ట్రిక్ట్ ఐసీటీసీ సూపర్‌వైజర్ సంపతయ్య, సంపూర్ణ సురక్ష మేనేజర్ రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో మొబైల్ ఐసీటీసీ టెక్నీషియన్ జయకుమార్, సంపూర్ణ సురక్ష అవుట్ రీచ్ వర్కర్లు మేణు, శ్రీలక్ష్మీ, ఎల్‌డబ్ల్యూ లింక్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండిన రైతులను ఆదుకోవాలి

● కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి

కేతేపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ కారణాల వల్ల ఎండాకాలం పంటలు ఎండిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో ఏఎమ్మార్పీ ఆయకట్టు పరిధిలో ఎండిన పంటలను శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పంటలు ఎండిన రైతులతో మాట్లాడారు. పంట ఎండటానికి గల కారణాలు, జరిగిన నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏఎమ్మార్పీ డి49 కాల్వకు సక్రమంగా సాగునీటిని అందించకపోవడంతో పంటలు ఎండి రైతులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. నీరు, విద్యుత్ సక్రమంగా సరఫరా జరగక పంటలు ఎండిన రైతులకు ఒక్కో ఎకరాకు రూ.30వేలు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం అమలులోకి తెచ్చిన ఫసల్ బీమాయోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయకపోవడం వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలులోకి తెచ్చి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల వెంకన్న, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సీహెచ్.జానయ్య, నాయకులు జి.సాయన్న, ఎస్.విజయలక్ష్మి, కూరెళ్ల వెంకటేశ్వర్లు, జటంగి సైదులు, లింగాల నరేష్, అఖిల్ పాల్గొన్నారు.


చెరుకుపల్లిలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న గోలి మధుసూదన్‌రెడ్డి

క్షయరహిత జిల్లాగా మార్చాలి

● జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి


ముగ్గుల పోటీల వద్ద విద్యార్థినులతో డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

నల్లగొండక్రైం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): నల్లగొండను క్షయరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి అన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా క్షయ నివారణ కార్యాలయం, రివర్ నిమ్స్ సంయుక్త సహకారంతో జిల్లా స్థాయిలో నర్సింగ్, డిగ్రీ, పారా మెడికల్ విద్యార్థినులకు టీబీ నిర్మూలన, అవగాహన, ముందస్తు జాగ్రత్తలపై జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్షయ రహిత జిల్లా కోసం విద్యార్థినులు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన 30 జట్లు ప్రాతినిధ్యం వహించాయి. కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ బ్లెస్సీ ఎస్తర్, డాక్టర్ రవిప్రసాద్, డాక్టర్ సుధ బుసిరెడ్డి, డాక్టర్ రమేష్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ లావణ్య, నిమ్స్ ముఖ్య అధికారి దీపక్, విద్యార్థినులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

● జిల్లా కేంద్ర ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి


రోగులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అరుణకుమారి

నల్లగొండటౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ కుమారి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఆమె మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రతో కలిసి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఆసుపత్రిలోని సర్జరీ వార్డును పరిశీలించి సర్జరీ విభాగం వైద్యులు అందించిన వైద్య సేవల గురించి, వార్డులో పారిశుద్ధ్యం, ఆహార సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్లు, సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ తోడ్పాటుతో పేదలకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అన్వేష్, ఇంటర్న్ సిబ్బంది ఉన్నారు.

నర్సరీల పెంపకంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో మున్నయ్య

మర్రిగూడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): నర్సరీల పెంపకంపై నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని ఎంపీడీవో మున్నయ్య అన్నారు. మండలంలోని రాజుపేట తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నర్సరీని ఆయన పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా వాటికి నీరుపోసి సంరక్షించాలని ఆయన సూచించారు. గ్రామ కార్యదర్శి ఫీల్డ్ అసిస్టెంట్ల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని, నర్సరీలో మొక్కలు ఎదగటానికి తగు జాగ్రత్తలు తీసుకొని వాటిని పరిరక్షించాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎంపీవో వివేక్, కార్యదర్శి వంశీ, ఫీల్డ్ అసిస్టెంట్ భిక్షం తదితరులు ఉన్నారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం : కిరణ్

నల్లగొండ క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న విద్యార్థి నాయకులను ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లూరి కిరణ్ అన్నారు. శుక్రవారం చలో అసెంబ్లీ నేపథ్యంలో ఆయన్ను నల్లగొండ టూటౌన్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని, విద్యారంగానికి ప్రత్యేకంగా మంత్రిని నియమించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, కేంద్రం తెచ్చిన ఎన్ఈపీ 2020, యూజీసీ నూతన ముసాయిదా 2025లను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఓయూ విషయంలో జారీ చేసిన నియంతృత్వ సర్క్యులర్ వెనక్కి తీసుకోవాలని, రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.120	180	200
సూర్యాపేట	రూ.95	140	170
నల్లగొండ	రూ.100	145	180

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 20.4


సాగర్ జలాశయం / మూసీ ప్రాజెక్టు


సాగర్, మూసీకి పూడిక ముప్పు

ఆధునిక దేవాలయం, బహుళార్థసాధక ప్రాజెక్టు అయిన నాగార్జునసాగర్ జలాశయం రోజు రోజుకూ నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐదు జిల్లాల పరిధిలోని ఆయకట్టు అన్నదాతల ఇంట సిరులు కురిపిస్తున్న సాగర్ జలాశయంలో నీటి నిల్వ తగ్గుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి,నాగార్జునసాగర్)

- ఈ ఏడాది సుమారు 112 టీఎంసీల మేరతగ్గిన నీటి నిల్వ
- ఏటా వందల టీఎంసీల నీరు కడలిపాలు
- రాళ్లు, రప్పలతో పేరుకుపోతున్న పూడిక
- ఆందోళనలో ఆయకట్టు రైతాంగం

కృష్ణా నది పరివాహకం 2,58,948 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉండగా, ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటితో పాటు ఒండ్రు మట్టి, ఇసుక ఏటా నాగార్జునసాగర్ జలాశయంలోకి వచ్చి చేరుతోంది. అదే విధంగా నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎత్తయిన గుట్టల పై నుంచి వచ్చే వరద నీటితో పాటు రాళ్లు, రప్పలు కృష్ణ నదిలోకి వచ్చి చేరుతున్నాయి. వరద అధికంగా వచ్చే సమయంలో నదీ తీరాలను ఒరుసుకుంటూ వచ్చే నీటి ఉధృతితో తీరాలు కోతకు గురై చెట్లు, చేమలు, మట్టి కొట్టుకొని వచ్చి ఏటా జలశయంలోకి చేరుతోంది. జలాశయంలో నిండుగా నీరున్నపుడు గుట్టలు నదిలోకి కూలుతున్నాయి. 110 చదరపు మైళ్ల పరిధిలో ఐదు జిల్లాల నడుమ విస్తరించి ఉన్న జలాశయంలో వేలాదిగా జీవాలు, జంతు జలాలు తాగునీటికి వచ్చినపుడు ఎత్తయిన ప్రాంతాల నుంచి జారిపడే రాళ్లు తక్కువేమీ కావు. ఒక్క రోజేగాక ఏడాది పొడవునా ఇదే జరుగుతోంది. జలాశయం నుంచి మాత్రం ఒక్క తట్ట మట్టి గానీ, ఏ ఒక్క రాయి కూడా బయటికి వెళ్లడం లేదు. దీంతో పూడిక పెరిగి నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోంది. పూడికకు నివారణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్ ఏడారిగా మారే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


సాగర్ జలాశయంలో కొండలపై నుంచి కూలుతున్న రాళ్లు (ఫైల్)

చర్యలు శూన్యం

సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన జరగ్గా, 1967లో పూర్తయింది. నాటి నుంచి నేటి వరకు 70 ఏళ్లలో చేరిన పూడిక సుమారు 112 టీఎంసీల (శతకోటి ఘనపుటడుగులు) పైచిలుకు నీటి నిల్వలు ఉండే ప్రాంతాన్ని మింగేసింది. ఏ ప్రభుత్వం కూడా నేటి వరకు పూడికపై ఎలాంటి దృష్టిసారించలేదు. దీంతో ఆయకట్టు రైతాంగం ఆందోళనకు గురవుతోంది. కేంద్రం జల నిపుణుల బృందం ఐదు, పదేళ్లకోసారి పూడికపై సర్వే నిర్వహించి ఎంత పూడిందో చెప్పడమేగానీ ఎలాంటి చర్యలు చేపట్టాలో వివరించిన దాఖలాలు లేవు. సాగర్ జలాశయాన్ని గరిష్ఠ వరద ప్రవాహం 10.60లక్షల...

- మిగతా 7వ పేజీలో...



నీటిబొట్టు ఒడిసి పట్టు

జలం.. సకల జీవకోటికి ప్రాణాధారం.. జలం లేనిదే మనిషి మనుగడ లేదు. జీవాధారమైన ఈ జలాన్ని మనిషే వృథా చేస్తున్నాడు. జనాభా పెరుగుదలతోపాటు మనిషి స్వార్థ ప్రయోజనాల కోసం అవసరానికి మించి నీటిని వినియోగిస్తున్నాడు.అంతేగాక భవిష్యత్ అవసరాల కోసం మిగిల్చి ఉంచాల్సిన జలాన్ని వృథా చేస్తున్నాడు. దీనికితోడు జలచక్రం సాఫీగా సాగేందుకు ఉపయోగపడే అడవుల ను, చెట్లను ఇష్టారీతిన నరికివేస్తుండటంతో అనావృష్టి, అతివృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో జలాశయాలు, చెరువు లు, కుంటల్లో నీరు అడుగంటి భూగర్భనీటిమట్టం పాతాళానికి పడిపోతోంది. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా నల్లగొండలో ఈ పరిస్థితి దారుణంగా ఉంది. నల్లగొండ జిల్లాలో భూగర్భ నీటి మట్టం 7.74మీటర్ల లోతులో ఉండగా, సూర్యాపేట జిల్లాలో 3.60మీటర్లు, యాదాద్రి జిల్లాలో 2.36 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. నల్లగొండ డివిజన్‌లో 2022లో 4.85 మీటర్ల లోతులో భూగర్భనీటిమట్టం ఉండగా, ఈ ఏడాది 8.59మీటర్ల లోతుకు పడిపోయింది. దేవరకొండ డివిజన్‌లో 2022లో 6.14 మీటర్ల లోతులో ఉండగా, ఈ ఏడాది 8.44మీటర్లకు పడిపోయింది. మిర్యాలగూడ డివిజన్‌లో 2022లో 5.71మీటర్ల లోతులో ఉండగా, ప్రస్తుతం 6.23మీటర్ల లోతుకు భూగర్భజలమట్టం పడిపోయింది.

చెమ్మనూ పెంచాడు

అడవిని సృష్టించిన దుశ్చర్ల

● 6లో...

నిధుల కొరత, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం వెరసి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెం డో నాగార్జునసాగర్‌గా ఉన్న మూసీ జలాశయానికి పూడి క ముప్పు ముంచుకొస్తోంది. జిల్లాలో రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న ఈ ప్రాజెక్టు ఏటా పూడికతో నిండుతోంది. సుమారు 30వేల ఎకరాలకు సాగునీరందించే ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురవుతోంది.

- (ఆంధ్రజ్యోతి,కేతేపల్లి)

- నానాటికీ తగ్గుతున్న రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం
- పరిరక్షణ చర్యలు చేపట్టాలని సీడబ్ల్యూసీ హెచ్చరిక

నాగార్జునసాగర్ తర్వాత ఉమ్మడి జిల్లాలో ప్రధాన నీటి వనరుగా మూసీ ప్రాజెక్టు ఉంది. ప్రాజెక్టుకు ఉన్న స్కవర్‌గేట్లు పూర్తిగా మూసి వేయడంతో మూసీ నదికి వరదలు వచ్చినప్పుడు ఉప నదులు, వాగుల ప్రవాహంతో ఇసుక, మట్టి వరద నీటితో కలిసి ప్రాజెక్టులోకి వచ్చి పేరుకుపోతోంది. మూసీ ఎగువన ఉన్న పట్టణాలు, నగరాల నుంచి వినియోగించిన జలాలు, మురుగు సైతం ప్రాజెక్టులోకి చేరుతోంది. నది ఒడ్డు కోతకు గురికావడం కూడా పూడికకు ఓ కారణంగా ఉంది. దీంతో ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం ఏటా తగ్గుతుండగా, పూర్తిస్థాయి ఆయకట్టుకు నీటిని అందించడంలో విఫలమవుతోంది. 25.25చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉన్న ఈ రిజర్వాయర్‌లో చేరిన పూడిక సుమారు 10అడుగుల మేర ఉండనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రంగారెడ్డి జిల్లా వికారాబాద్ అడవుల్లో పుట్టిన మూసీ భువనగిరి జిల్లా మీదుగా నల్లగొండ జిల్లా నుంచి సూర్యాపేట జిల్లాకు చేరుతోంది.

సూర్యాపేట మండలం సోలిపేట వద్ద రెండు గుట్టల మధ్య రూ.2.20కోట్ల వ్యయంతో 1954లో మూసీ ప్రాజెక్టు పనులు ప్రారంభించగా, 1963 లో పూర్తయింది. రిజర్వాయర్‌లో సూర్యాపేట మండలం సోలిపేటతో పాటు కేతేపల్లి మండలంలోని బొప్పారం గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. ప్రాజెక్టులో చేరే పూడికను బయటికి పంపేందుకు వీలుగా 10 స్కవర్‌గేట్లు, వరద నీటిని దిగువకు వదిలేందుకు 8 క్రస్ట్‌గేట్లు, 12 రెగ్యులేటరీ గేట్లతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. 645అడుగుల (4.46 టీఎంసీలు) నీటినిల్వ సామర్థ్యంతో ఈ ప్రాజెక్టుకు నాటి ఇంజనీరింగ్ నిపుణులు రూపకల్పన చేశారు. దశాబ్దాల తరబడి ప్రాజెక్టు ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో ప్రాజెక్టు నిర్మించిన నాడు ఏర్పాటు చేసిన గేట్లు తుప్పుపట్టాయి. ప్రాజెక్టు నిర్మించిన నాటి నుంచి గేట్ల నిర్వహణకు నిధుల కేటాయింపు అరకొరగానే సాగింది. దీంతో 1987లో మూసీకి వచ్చిన వరద తాకిడికి 8వ నెంబర్ స్కవర్‌గేటు కొట్టుకుపోయింది. ఆ తర్వాత..

- మిగతా 7వ పేజీలో...


మూసీ ప్రాజెక్టులో మేట వేసిన పూడిక దిబ్బలు (ఫైల్)

తాగునీటి ఏర్పాట్లకు రూ.5.10కోట్లు విడుదల


నాంపల్లి ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు, బోర్లు, చేతిపంపులు, పైపులైన్లు, తాగునీటి ట్యాంకుల మరమ్మతుకు డీఎంఎఫ్‌టీ నిధులు రూ.5.10కోట్లు విడుదల చేసినట్టు కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 827 పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. మంజూరైన నిధులతో గ్రామాల్లో చేతిపంపులు, బోర్లు, పైపులైన్లు, నీటి ట్యాంకుల మరమ్మతు చేయించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ పనులను సంబంధిత ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు. పనుల పూర్తిఅంచనాలు రూపొందించి ముందస్తు అనుమతి తీసుకొని ప్రారంభించాల్రాను. అదేవిధంగా పనులు పూర్తయ్యాక ఫొటోలతో సహా బిల్లు లు సమర్పించాలని, గతంలో చేపట్టిన పనులు తిరిగి చేపట్టకూడదని, వేరే పథకాలలో చేపట్టిన పనులు డీఎంఎఫ్‌టీ నిధుల కింద చేపట్టవద్దని స్పష్టం చేశారు. ఎక్కడా తాగునీటికి సమస్య రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

(ఆంధ్రజ్యోతి, నాంపల్లి): ప్రభుత్వ ఆస్పత్రిలో అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం నాంపల్లి పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రి సిబ్బంది హాజరు, ఓపీ రిజిస్టర్, ఈడీడీ, ఏఎన్‌సీతో పాటు అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఏ ఆస్పత్రిలో లేనివిధంగా ఇక్కడ ఏడుగురు ఇన్ పేషెంట్లు ఉండడం చూసి వారితో మాట్లాడారు. తాము నాగర్‌కర్నూల్, హైదరాబాద్ నుంచి వచ్చామని ఇద్దరు రోగులు కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ వచ్చే సమయానికే 73మంది ఓపీ పేషెంట్లు వైద్య సేవలు పొందడంపై పీహెచ్‌సీ వైద్యురాలు భవానీని అభినందించారు. హాస్టల్ విద్యార్థులు రక్తహీనతతో బాధపడకుండా అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రి పరిధిలో గత ఏడాది డిసెంబరు వరకు 6శిశుమరణాలు సంభవించగా, ఈ మూడు నెలల్లో ఎలాంటి కేసులు లేవని డాక్టర్ భవాని కలెక్టర్‌కు వివరించారు. పీహెచ్‌సీకి ఆటోక్లేవ్, ఫిటల్ డాప్లర్, సర్జికల్ పరికరాలను కలెక్టర్ మంజూరు చేశారు.అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేసి వంటగది, డైనింగ్, తరగతి గదులు,భోజనాన్ని పరిశీలించారు. ఐదు, పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి కష్టపడి చదివి లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ జి.దేవాసింగ్, ఎంపీడీవో పీవీఎస్‌కె.శర్మ, ఎంపీవో ఝాన్సీ, డాక్టర్ తరుణ్, సీహెచ్‌వో ఏకనాథం, సూపర్‌వైజర్ అంజలి, ఎంఎల్‌హెచ్‌పీలు దువ్వ నవీన్, కళ్యాణి, సంతోష,తస్లీమా, దీపిక, ప్రశాంతి, తదితరులు ఉన్నారు.

కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఏటీసీకి స్థల పరిశీలన

(ఆంధ్రజ్యోతి, చండూరు): చండూరు మునిసిపాలిటీ పరిధిలోని అంగడిపేటలో ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) నిర్మాణం కోసం స్థలాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం పరిశీలించారు. 361 సర్వే నెంబర్‌లో సుమారు రెండు ఎకరాల స్థలంలో ఏటీసీ నిర్మాణం అనువైనదిగా ఆమె గుర్తించారు. స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని ఆర్డీవో శ్రీదేవిని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ దశరథ, మునిసిపల్ అధికారులు, ఉన్నారు.

‘పది’ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు 40 విద్యార్థుల గైర్హాజరు
- పలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

నల్లగొండటౌన్,మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం జిల్లాలో ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 105 కేంద్రాల్లో 18,511మంది విద్యార్థులకు 18,471 మంది హాజరుకాగా, 40మంది గైర్హాజరయ్యారు.కాగా, కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా కేంద్రంలోని దేవరకొండరోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీచేశారు. ఈ సందర్భంగా డీఈవో, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి, విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

(ఆంధ్రజ్యోతి, గుర్రంపోడు): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీచేశారు. కొందరు విద్యార్థులు మాస్కులు ధరించి ఉండటాన్ని గమనించిన వారు తీసుకువచ్చిన మాస్కులు కాకుండా అవసరమైన వారికి అధికారులే మాస్కులు పంపిణీ చేయాలని సూచించారు. 142 మంది విద్యార్థులకు అంతా హాజరయ్యారని, ఎంఈవో మండల నోముల యాదగిరి, చీఫ్ సూపరింటెండెంట్ శేఖర్ వివరించారు. కలెక్టర్ వెంట డీఈవో బి.భిక్షపతి ఉన్నారు.


జిల్లా కేంద్రంలో ఓ పరీక్షా కేంద్రాన్ని తనిఖీచేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:33 (శనివారం సాయంత్రం)
సహర్: 4:56 (ఆదివారం ఉదయం)

తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నల్లగొండ క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఉగాది, రంజాన్ పర్వదినాల సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టే వారిని నిరంతరం సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఎవరైనా ఇతర కులాలు, మతాలు, వ్యక్తులపై అనుచిత వ్యా ఖ్యలు చేసినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా అసత్య ప్రచారా లు చేసినా తగిన చర్యలు తప్పవన్నారు. ఎవరైనా ఇలాంటి పోస్టులు షేర్ చేస్తే, వారి సమచారాన్ని సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి

జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి


నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారితో జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

నల్లగొండ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాల ద్వారా నూతనంగా విధుల్లో చేరిన ఉద్యోగులు బాధ్యతలను సక్రమంగా నిర్వహించి పేరు తెచ్చుకోవాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాల ద్వారా జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరిన వారికి శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వీస్ రూల్స్ కార్యాలయ బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో బి.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొప్పు రాంబాబు, ప్రధానకార్యదర్శి కె.నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం

మిర్యాలగూడ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. నవ తెలంగాణ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను డీఎస్పీ రాజశేఖరరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చినిగిన చొక్కా అయినా తొడుక్కో, ఒక పుస్తకం కొనుక్కో అన్న పెద్దల మాటలను ఆచరించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, బావండ్ల పాండు, మల్లు గౌతంరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలనను జీర్ణించుకోలేకే ఆరోపణలు : కాంగ్రెస్

మిర్యాలగూడ టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనను జీర్ణించుకోలేకే బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ అన్నారు. శుక్రవారం హనుమాన్‌పేటలో మాట్లాడుతూ ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని పథకాలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ఆరు గ్యారంటీల్లో నాలుగు పథకాలను నెల లోపే అమలు చేసిందని గుర్తుచేశారు. రాష్ట్రంలోని మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్న రేవంత్ పాలనను విమర్శించే హక్కు గులాబీ పార్టీకి లేదన్నారు.

‘పది’ పరీక్షలు ఆరంభం

● మొదటి రోజు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసిన విద్యార్థులు ● ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ అధికారులు

పదో తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతవాతావరణంలో ఆరంభమయ్యాయి. ఉదయం నుంచే పరీక్ష కేంద్రాలకు బయలుదేరిన విద్యార్థులతో సందడి నెలకొంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

● పెద్దఅడిశర్లపల్లిలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను ఎంఈవో వెంకటయ్య, గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తనిఖీ చేశారు.

● నాగార్జునసాగర్‌లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సాగర్ హిల్‌కాలనీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలను అధికారులు కూర్మరెడ్డి, ప్రకాష్, అనసూయ, జార్జ్ పరిశీలించారు.

● కొండమల్లేపల్లిలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండలకేంద్రంలోని నాలుగు పరీక్షకేంద్రాల్లో మొత్తం 763 మందికి 761 మంది హాజరైనట్లు పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తెలిపారు.

● వేములపల్లిలో పది వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. కేంద్రాలను ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ తెలిపారు.

● దేవరకొండ పట్టణంలో పదో తరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగినట్లు దేవరకొండ ఎంఈవో మాతృనాయక్ తెలిపారు. పట్టణంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో 1,241 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఎంఈవో తెలిపారు.

● నిడమనూరులో శుక్రవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలకు మొదటి రోజు మండలంలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 384 మంది విద్యార్థులకు 382 మంది హాజరయ్యారు. నిడమనూరు జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో ఒకరు, మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో ఒకరు చొప్పున గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో వెంకన్న తెలిపారు.

● మిర్యాలగూడ పట్టణంలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి పరీక్ష కావడంతో విద్యార్థులు కేంద్రాల వద్దకు 8 గంటలకే తలిదండ్రులతో కలిసి వచ్చారు. 12 కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షలకు 2737 మందికి గాను 2732 మంది హాజరైనట్లు ఎంఈవో బాలునాయక్ తెలిపారు. పరీక్షా కేంద్రాలను డిప్యూటీ కలెక్టర్ అమిత్ నారాయణ్, మునిసిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, తహసీల్దార్ హరిబాబు పరిశీలించారు.



సాగర్‌లో పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు

● మాడ్గులపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొత్తం 139మంది విద్యార్థులకు 138మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈవో వెంకటమ్మ అన్నారు. పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ సురేష్ తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

● చింతపల్లి మండలంలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చింతపల్లిలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈవో అంజయ్య తెలిపారు. తహసీల్దార్ రమాకాంత్‌శర్మ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

రేషన్‌బియ్యం
పక్కదారి పట్టిస్తే చర్యలు

● దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్

రేషన్‌బియ్యం పక్కదారి పట్టించిన డీలర్లపై చర్యలు తీసుకుంటాం. పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేశాం. డీలర్లు బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే డీలర్‌షిప్ రద్దుచేసి చర్యలు చేపడుతామని దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్ గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

● దేవరకొండ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: రేషన్‌బియ్యం పక్కదారి పట్టకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: రేషన్‌బియ్యాన్ని డీలర్లు సక్రమంగా వినియోగదారులకు పంపిణీ చేసేలా అన్ని చర్యలు చేపడుతున్నాం. పౌరసరఫరాలు, రెవెన్యూ, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో నూతనంగా ఎన్ని రేషన్‌కార్డులు మంజూరు చేశారు?

తహసీల్దార్: ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న 407 మందికి నూతనంగా రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. రేషన్‌కార్డులు రానివారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: దేవరకొండలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ వక్ఫ్ బోర్డు భూముల మాటేమిటి?

తహసీల్దార్: ప్రభుత్వ వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమించుకుంటే చర్యలు చేపడుతాం.ఇప్పటికే ప్రభుత్వ భూములను సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేశాం. భూ ఆక్రమణదారులపై చర్యలు చేపడుతాం.

ఆంధ్రజ్యోతి: తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించడంలేదన్న ఫిర్యాదుల మాటేమిటి?

తహసీల్దార్: తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ఎప్పుడు ఏర్పాటు చేస్తారు?

తహసీల్దార్: ప్రస్తుతం నైజాంకాలంలో నిర్మించిన భవనంలోనే కార్యాలయం కొనసాగుతుంది. వర్షాకాలంలో కొంత ఇబ్బంది కలుగుతుంది. మరమ్మతులు నిర్వహిస్తున్నాం. నూతన భవన నిర్మాణ ఏర్పాటుకై ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులకు నివేదికలు అందజేశాం. త్వరలోనే ఆదేశాలు వస్తాయని ఆశిస్తున్నాం.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

● ఆర్టీసీ డీఎం రమేష్‌బాబు



అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ డీఎం రమేష్‌బాబు

దేవరకొండ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వేసవిలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ ఆర్టీసీ డిపోలో అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎం రమేష్‌బాబు, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అకస్మాత్తుగా మంటలు చెలరేగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచనలు చేశారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై డెమోల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, అగ్నిమాపక, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు కనీస వేతనం అందించాలి



మాడ్గులపల్లిలో నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

వేములపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్లకు కనీస వేతన చట్టం అమలు చేసి రూ.26వేల వేతనాన్ని అందించాలని సీఐటీయూ జిల్లా నేత రొండి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆశా వర్కర్ల న్యాయపరమైన సమస్యలన్నింటిని పరిష్కరించాలని మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశాలతో కలిసి నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. పల్స్‌పోలియో, లెప్రసీ సర్వేల బిల్లులను వెంటనే చెల్లించాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫాంను ఉచితంగా అందించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కోడిరెక్క వెంకన్న, వడ్డెగాని సైదులు, అయితగాని విష్ణు, ఆశా వర్కర్లు రాధిక, లక్ష్మీ, రజిత, సుజాత, నాగమ్మ, జయమ్మ పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రొండి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పాములపాడు పీహెచ్‌సీ కేంద్రం వద్ద ఆశా వర్కర్లతో కలిసి ధర్నా చేపట్టి అనంతరం డాక్టర్ సత్యనారాయణకు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐతోపాటు ఉద్యోగ భద్రత కల్పించి పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పల్స్ పోలియో బిల్లులను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కోడిరెక్క వెంకన్న, ఆశా వర్కర్లు కోటమ్మ, సైదమ్మ, రజిత, గోవర్ధన, సరిత, శోభా, పద్మ, పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌కు అభినందనలు



శంకర్‌నాయక్‌ను అభినందిస్తున్న కాంగ్రెస్ నేతలు

మాడ్గులపల్లి, మార్చి 21: నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌ను కాంగ్రెస్ మండలనేతలు శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్త స్థాయినుంచి ఎమ్మెల్సీ వరకు ఎదిగిన శంకర్‌నాయక్‌ను మండల నాయకులు అభినందించి శాలువాలతో సన్మానించారు. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, రావు ఎల్లారెడ్డి, నాయకులు మునగాల రామచంద్రారెడ్డి, సతీష్, సైదిరెడ్డి ఉన్నారు.

ఆలయ భూముల సర్వే వాయిదా

● ఆగ్రహంతో ధర్నా నిర్వహించిన గ్రామస్థులు ● అసెంబ్లీ సమావేశాలు ముగిశాక సర్వే చేస్తామన్న తహసీల్దార్



గ్రామస్థులకు సర్ది చెబుతున్న ఎస్ఐ మధు

గుర్రంపోడు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుర్రంపోడు మండలం కొప్పోలులో శుక్రవారం ఆలయ భూములకు సర్వే నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అధికారులు అనూహ్యంగా వాయిదా వేయడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కబ్జాదారుల ఒత్తిడితోనే సర్వే వాయిదా వేశారని వెంటనే సర్వే చేపట్టాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అసెంబ్లీ సమావేశాలు ముగిసేంత వరకూ సర్వే తాత్కాలికంగా వాయిదా వేశామని ఇన్‌చార్జి తహసీల్దార్ షేక్ ఫరుద్దీన్ అన్నారు. సమావేశాలు ముగిసిన అనంతరం ఈ నెల 30వ తేదీ తర్వాత సర్వే చేపడతామని గ్రామస్థులకు తెలిపారు. స్థానిక ఎస్ఐ మధు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం అధికారులు సర్వే జరిగేలా చూస్తారని, గ్రామస్థులు సహకరించాలన్నారు. త్వరగా సర్వే చేసి హద్దురాళ్లు పాతించాలని తహసీల్దార్‌కు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ అయితగోని పరమేష్‌గౌడ్, బైరి బలరాం, లక్ష్మినారి, నీలం సైదులు, అనిల్, నరసింహ, రవి, నాగరాజు, కుమార్, నెహ్రూ, నగేష్ పాల్గొన్నారు.

విద్యారంగానికి కేటాయింపులేవీ? : ఎస్‌ఎఫ్‌ఐ



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

కొండమల్లేపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి సరైన కేటాయింపులు చేయలేదని పేర్కొంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు కొండమల్లేపల్లి మండలకేంద్రంలో రాష్ట్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ టెక్నికల్ రాష్ట్ర కోకన్వీనర్ రమావత్ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బడ్జెట్‌లో కేవలం విద్యారంగానికి 7.57శాతం మాత్రమే నిధులు కేటాయించరాని, ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, శ్రీరాం, సాయిరాం, శరత్, విజయ్, కల్యాణ్, శివాజి, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

వేర్వేరు ప్రమాదాల్లో శుక్రవారం ఇద్దరు మృతి చెందారు. దేవరకొండ మండలంలో ఒకరు, కొండమల్లేపల్లి మండలంలో మరొకరిని గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్నాయి. ఆయా ఘటనల్లో వారు దుర్మరణం చెందారు.

దేవరకొండ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం కొమ్మెపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఒకరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో మండలంలోని బద్యానాయక్‌తండాకు చెందిన నేనావత్ చిరంజీవి(27) మృతి చెందాడు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం బద్యానాయక్‌తండాకు చెందిన చిరంజీవి హైదరాబాద్‌లో ఆటోనడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంపై దేవరకొండకు వచ్చి రాత్రి స్వగ్రామం బద్యానాయక్‌తండాకు వెళుతున్నాడు. కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి చిరంజీవి బైక్‌ను ఢీకొనడంతో చిరంజీవి తీవ్రగాయాలై దేవరకొండ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. చిరంజీవి హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ భార్యతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. మూడురోజుల క్రితమే స్వగ్రామమైన బద్యానాయక్‌తండాకు వచ్చాడు. చిరంజీవి తమ్ముడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కొండమల్లేపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటనకొండమల్లేపల్లి మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. బంధువుల వివరాల ప్రకారం.. పెద్దఅడిశర్లపల్లి మండలం మల్లాపురం గ్రామానికి చెందిన నారాయణదాసు శ్రీనయ్య(53) కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని విద్యుత్ కేంద్రంలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలోనే మండలంలోని కొల్‌ముంతలపహాడ్ గేటు సమీపంలో విధులు ముగించుకొని తన ద్విచక్రవాహనంపై యూటర్న్ తీసుకుంటుండగా దేవరకొండ నుంచి కొండమల్లేపల్లి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన నారాయణదాసు శ్రీనయ్యను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీనయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదానికి సంబంధించి కొండమల్లేపల్లి ఏఈ దేవుజ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

● డీఎల్పీవో శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీవో శంకర్‌నాయక్

చింతపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో శంకర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం చింతపల్లి మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి వసతి సౌకర్యం కల్పించేందుకు కార్యదర్శులు చొరవ తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులు వసూలు చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. సమాశంలో ఎంపీడీవో సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శేఖర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషిస్తే కఠిన చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న ఏఎస్పీ మౌనిక

● ఏఎస్పీ మౌనిక

పెద్దఅడిశర్లపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలను కులం పేరుతో దూషించినా, దాడులు చేసినా కఠిన చర్యలు ఉంటాయని దేవరకొండ ఏఎస్పీ మౌనిక హెచ్చరించారు. శుక్రవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని నర్లంగ తండ గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కేసు విచారణలో భాగంగా సందర్శించి కేసు పూర్వపరాలను అడిగి తెలుసుకున్నారు. గతనెల రోజులక్రితం గ్రామంలో నమోదు అయిన కేసులో సాక్ష్యులు, స్థల పంచనామా నిర్వహించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ఆమె మాట్లాడారు. చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమెవెంట ఎస్ఐ నర్సింహులు, ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చింతపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంకటేశ్వరనగర్ కొండపైన శుక్రవారం వేణుగోపాల స్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాలలో భక్తులతో రుద్ర హోమం కన్నుల పండువగా జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదంతోపాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆల య కమిటీ ఛైర్మన్లు పూరె లక్ష్మణ్, అంగిరేకుల గోపాల్, ధర్మకర్తలు మాల్ సత్యసాయి మాజీ కన్వీనర్ పూరె యాదయ్య, బండారు సీతరాములు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘం డబ్బుతో బ్యాంక్ మేనేజర్ పరారీ



బ్యాంక్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

దేవరకొండ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు పొదుపు చేసుకున్న రూ.6లక్షల నగదుతో బంధన్ బ్యాంక్ (ప్రైవేట్ రంగం) మేనేజర్ పరారయ్యాడు. దేవరకొండలో ఈ సంఘటన జరిగింది. బాధితులు చిలువేరు రేణుక, నాగమ్మ, నిర్మల, నవీన, అంజమ్మలు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతాలోని బంధన్ బ్యాంకు అనుబంధ శాఖ నల్లగొండ జిల్లా దేవరకొండలో గత పదేళ్లుగా నిర్వహిస్తున్నారు. బంధన్ బ్యాంక్‌లో కొండమల్లేపల్లికి చెందిన సాయితేజ మహిళా సంఘం పేరుతో ఒక్కొక్కరు రూ.50వేల చొప్పున నవంబరు 2024లో రుణం తీసుకున్నారు. రూ.5వేలు ఖర్చులకుపోను 18మంది సభ్యులకు ఒక్కొక్కరికి రూ.45వేలను బ్యాంక్ సిబ్బంది చెల్లించారు. మహిళలు తీసుకున్న డబ్బులకు ఒక్కో సభ్యురాలు వారానికి రూ.1400 చొప్పున 48వారాలు బ్యాంక్‌కు చెల్లించాల్సి ఉంది. బ్యాంక్ నిబంధనల ప్రకారం బాధితులు బ్యాంక్ రికవరీ ఏజెంట్ అంజిబాబుకు పూర్తి డబ్బులు చెల్లించారు. తిరిగి తమకు కొత్త రుణాలు ఇవ్వాలని ఆరు నెలలుగా మహిళలు బ్యాంక్‌చుట్టూ తిరుగుతున్నారు. ఇటీవల మహిళలు బ్యాంక్‌కు వెళ్లి విచారించగా వారిపేర్లపై అప్పులు ఉన్నట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు. దీంతో తమ వద్ద డబ్బులు వసూలు చేసిన బ్యాంక్ సిబ్బంది అంజిబాబును నిలదీయగా వసూలు చేసిన నగదును బ్యాంక్ మేనేజర్ హేమంత్‌శికి అందజేసినట్లు బాధితులకు తెలిపారు. 15 రోజుల క్రితం దేవరకొండ బ్యాంక్‌లో అవకతవకలు జరిగాయని తెలుసుకున్న కోల్‌కతాకు చెందిన బ్యాంక్ యాజమాన్యం దేవరకొండకు చేరుకుని విచారణ జరిపి అవకతవకలకు పాల్పడిన బ్యాంక్ మేనేజర్ హేమంత్‌శి, క్యాషియర్ శ్రవణ్, రికవరీ సిబ్బందిని సస్పెండ్ చేసి, వారి స్థానంలో కొత్తవారిని నియమించారు. తాము పూర్తిగా డబ్బులు చెల్లించినప్పటికీ సాయితేజ మహిళా సంఘం పేరుతో రూ.లక్షా80వేల వరకు అప్పు ఉందని బ్యాంక్ అధికారులు చెబుతుండడంతో మహిళలు శుక్రవారం బ్యాంక్ ఎదుట ఆందోళన చేపట్టారు. అవకతవకలకు పాల్పడిన మేనేజర్ సస్పెండ్ కావడంతో కోల్‌కతాకు పారిపోయాడని మహిళలు వాపోయారు. తాము చెల్లించిన మొత్తంలో కొంత బ్యాంకుకు చెల్లించి, సుమారు రూ.6లక్షలతో మేనేజర్ పరారయ్యాడని, ఇంకా వెలుగులోకి రావల్సినవి చాలా ఉన్నాయని మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ప్రస్తుత బ్యాంక్ మేనేజర్ నరేందర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా గత మేనేజర్ అవకతవకలకు పాల్పడ్డాడని బ్యాంక్ యాజమాన్యం సస్పెండ్ చేసిందన్నారు. ఈ ఘటనపై విచారణ జరుగుతోందని, తనకేమీ తెలియదని తెలిపారు. ఈ విషయమై దేవరకొండ ఏఎస్పీ, సీఐకి ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత మహిళ చిలువేరు రేణుక తెలిపారు.

ఎస్ఈగా మల్లికార్జున్‌రావు బాధ్యతల స్వీకరణ



మల్లికార్జున్‌రావును సన్మానిస్తున్న సిబ్బంది

నాగార్జునసాగర్, మార్చి21 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఇన్‌చార్జీ ఎస్ఈగా ఈఈ మల్లికార్జున్‌రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఈ శ్రీధర్‌రావు దీర్ఘకాల సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఈఈ మల్లికార్జున్‌రావుకు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జీ ఎస్ఈని ప్రాజెక్టు ఇంజనీర్లు కృష్ణయ్య, సత్యనారాయణ, విజయ్‌కుమార్, శ్రీనివాస్ సిబ్బంది సన్మానించారు.

సంక్షిప్తం

● మిర్యాలగూడ లీగల్: మిర్యాలగూడ మునిసిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా స్థానిక న్యాయవాది కంచుకొమ్ముల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అడవిదేవులపల్లి మండలకేంద్రానికి చెందిన కంచుకొమ్ముల శ్రీనివాస్ 2004 నుంచి మిర్యాలగూడ కోర్టులో న్యాయవాదిగా కొనసాగుతున్నారు.

● మిర్యాలగూడ టౌన్: విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పట్టణవాసులు పతకాలు సాధించారు. కోదాడలో నిర్వహించిన పోటీల్లో రిటైర్డ్ హెడ్‌మాస్టర్ దండ పిచ్చిరెడ్డి వాకింగ్‌రేస్‌లో ద్వితీయ స్థానం సాధించారు. చెస్ పోటీలలో పట్టణానికి చెందిన రిటైర్డ్ టీచర్ సిరిగిరి వెంకటరెడ్డి రాష్ట్రస్థాయి 3వ స్థానంలో నిలిచి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు.

● మిర్యాలగూడ రూరల్: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఎంప్లాయీస్ ఖోఖో పోటీలకు మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామనికి చెందిన పీడీ బచ్చలకూరి శివ ఎంపికయ్యారు. శివ ప్రస్తుతం దేవరకొండ మండలం పడమటిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు.

● పెద్దఅడిశర్లపల్లి: మత్స్యకారుల సంక్షేమానికి నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి మత్స్యకారుల రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన నేపథ్యంలో పీఏపల్లి, గుడిపల్లి మండలాల్లోని ముదిరాజ్ మత్స్యకారులనేతలు గుడిపల్లి పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్టుచేశారు.